


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 30-07-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 279 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## పక్షులు వచ్చేశాయ్..

# నవశకానికి నాంది!

### రఫేల్ ఫైటర్ జెట్ల రాకపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హర్షం



దిల్లీ: అత్యంత అధునాతన రఫేల్ యుద్ధవిమానాలు భారత వైమానిక అమ్ముల పొదిలో వచ్చి చేరాయి. ఫ్రాన్స్ నుంచి 5 రఫేల్ ఫైటర్ జెట్‌లు భారత్‌కు చేరుకోవడంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తంచేశారు. రఫేల్ యుద్ధ విమానాలు భారత్‌కు సురక్షితంగా చేరాయని ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఈ జెట్‌ల రాక భారత సైనిక చరిత్రలో సరికొత్త శకానికి నాందిగా ఆయన అభివర్ణించారు. భారత వైమానిక దళం సామర్థ్యం మరింత పెరిగిందని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న వేళ ఈ విమానాలు అందజేసిన ఫ్రాన్స్ ప్రభుత్వానికి రాజ్‌నాథ్ కృతజ్ఞతలు తెలిపారు. డసాల్ట్ ఏవియేషన్, ఫ్రెంచ్ కంపెనీలు సమయానికి విమానాలు చేరవేశాయని అభినందించారు.

ఈ విమానాలు మంచి పనితీరు కలిగి ఉన్నాయని రాజ్‌నాథ్ అన్నారు. అలాగే, దాని లోని ఆయుధాలు, రాడార్లు, ఇతర సెన్సార్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యాలు ప్రపంచంలోనే అత్యుత్తమమైనవన్నారు.

ఈ ఫైటర్‌జెట్‌ల రాకతో దేశానికి ఎదురయ్యే ముప్పును దీటుగా ఎదుర్కొనేందుకు దేశీయ వైమానిక సామర్థ్యం మరింత బలోపేతమైందని పేర్కొన్నారు.

భారత వైమానిక దళం అవసరాలను పూర్తిగా తీర్చేందుకే వీటిని కొనుగోలు చేసినట్టు చెప్పారు. ఈ జెట్‌ల కొనుగోళ్లపై వచ్చిన నిరాధార ఆరోపణలపై ఇప్పటికే సమాధానం చెప్పినట్టు గుర్తుచేశారు.

ఈ మేరకు రఫేల్ ఫైటర్ జెట్‌లు అంబాలాలో సురక్షితంగా ల్యాండ్ అయిన వీడియోను ట్వీట్ చేశారు.

# వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం

### - హాజరైన డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



తాడేపల్లి : ఆంధ్రప్రదేశ్ 211వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, సీఎస్ నీలం సాహ్ని, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ జనరల్ మేనేజర్ వి.బ్రహ్మానందరెడ్డి, నాబార్డ్ సీజీఎం సుధీర్‌కుమార్.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూనియన్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్‌కుమార్ గార్డ్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ సుబ్రతాదాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. '2020-21 సంవత్సరంలో రుణాల లక్ష్యం 2,51,600 కోట్లు. ఇది గత ఏడాదితో పోలిస్తే 9.78 శాతం అధికం. వ్యవసాయరంగానికి రూ.1,28,660 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది గత ఏడాదితో పోలిస్తే 11.9శాతం అధికం. 2019-20 రుణప్రణాళికలో 99.42 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు)కు రూ.39,600 కోట్ల రుణాలు ఇవ్వాలని భావిస్తున్నాం. గత ఏడాదితో పోలిస్తే 10 శాతం అధికం. విద్యా రుణాల కింద రూ.1,900 కోట్లు, ఇళ్ల రుణాల కింద రూ.9,710 కోట్లు, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.410 కోట్లు ఇవ్వాలని లక్ష్యం. పునరుత్పాదక ఇంధన (రెన్యువబుల్ ఎనర్జీ) రంగానికికి రూ.454 కోట్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. వ్యవసాయ రంగంలో యాంత్రికీకరణకు రూ.3,400 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొత్తం మీద ప్రాధాన్యతా రంగానికి రూ.1,87,550 కోట్లు ఇవ్వాలని భావిస్తుండగా.. ఇది గత ఏడాదితో పోలిస్తే 10.88 శాతం అధికం. ప్రాధాన్యేతర రంగానికి రూ.64,050 కోట్లు రుణాలుగా ఇవ్వాలని లక్ష్యం. గత ఏడాదితో పోలిస్తే ఇది 6.75 శాతం అధికం' అని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

**సమావేశంలోని ముఖ్యాంశాలు..**

రైతులకు సున్నా వడ్డీ సకాలంలోనే ఇవ్వాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉంది. ఖరీఫ్ రుణాలకు సంబంధించి సున్నా వడ్డీ డబ్బును రబీ నాటికి చెల్లిస్తామని, రబీ రుణాలకు సంబంధించి సున్నా వడ్డీ డబ్బును ఖరీఫ్ నాటికి చెల్లిస్తామని, దీనికి సంబంధిచిన వివరాలు సకాలంలో ప్రభుత్వానికి సమర్పించాలని ప్రభుత్వ అధికారులు బ్యాంకర్లను కోరారు. అలాగే గ్రామాల్లో గోదాములు, గ్రేడింగ్, సార్టింగ్ తదితర ఫుడ్ ప్రాసెసింగ్ కోసం ఒక ప్రత్యేక

తరువాయి 2లో..

# దాచాల్సిన అవసరం లేదు

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని



తూర్పుగోదావరి: కోవిడ్‌పై చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో బుధవారం రోజున కోవిడ్‌పై ఏర్పాటు చేసిన సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరోనా పరీక్షల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా ఏపీ ఉంది. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే కరోనా డెత్ రేట్ తక్కువగా ఉంది. ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యానికి నిరాకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అత్యంత పారదర్శకంగా కరోనా చర్యలు చేపడుతున్నాం.

ప్రభుత్వంపై చంద్రబాబు విమర్శలు సరికావు. ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కడా డాక్టర్ల కొరత లేదు. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే 24 గంటల్లోనే పరిష్కరించాం. చికిత్స పొందుతున్న పేషెంట్లతో మాట్లాడాము. ప్రస్తుతం జిల్లాలో ఆరు కోవిడ్ ఆసుపత్రులు ఉన్నాయి. వాటి

తరువాయి 2లో..

## మాతృభాషతోనే

# జ్ఞాన సముపార్జన

### ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దిల్లీ: ఆంగ్లభాష ద్వారా మాత్రమే అభివృద్ధి అనడం సరికాదని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. 'జ్ఞాన సముపార్జన మాధ్యమం-మాతృభాష' అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ వెబినార్ ప్రారంభ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నాలుగు వేల ఏళ్ల చరిత్ర పరిశీలిస్తే ఇదంతా అర్థమవు తుందన్నారు. అమృతం లాంటి మాతృభాష రేపటి తరాలకు అందాలని ఆకాంక్షించారు. "అభివృద్ధి చెందిన దేశాల్లో మాతృభాషకే అగ్రతాంబూలం. మాతృభాషలో పరిశోధన చేసిన వారికే నోబెల్ బహుమతులు వచ్చాయి. అనేకమంది విదేశీ నేతలు మాతృభాషలోనే మాట్లాడతారు. అంగ్లం వచ్చినా అనేకమంది అగ్రనేతలు వారి మాతృభాషే మాట్లాడతారు. జ్ఞాన సముపార్జనకు మాతృభాష ఎంతో దోహదం చేస్తుంది. సామాన్య ప్రజలకు అర్థమయ్యే భాషలోనే పరిపాలన జరగాలి. అన్ని రాష్ట్రాలూ అధికార భాషను మరింత ప్రోత్సహించాలి. 90 శాతం దేశాలు మాతృభాషలోనే విద్యాబోధన చేస్తున్నాయి. మాతృభాష ద్వారానే పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. నేటి చిన్నారులు



పెద్దబాలశిక్ష, వేమన, సుమతి శతకాలు చదవాలి. మాతృభాషను మరింత లోతుగా పరిశీలిస్తే ఎన్నో పదాలు తెలుస్తాయి. మాతృభాషను ఉపాధి రంగంతో అనుసంధానం చేయాలి. వివిధ రంగాల అవసరాలు తీర్చేలా మారిస్తేనే మాతృభాషలకు మనుగడ. సాంకేతిక నిపుణులు కూడా మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి. భారత్‌లో ఉన్నన్ని భాషలు మరో దేశంలో లేవు. కరోనా వేళ సురక్షిత దూరం, స్వీయనియంత్రణ పదాలు సృష్టించాం" అని వెంకయ్య నాయుడు వివరించారు.

# అచ్చెన్న బెయిల్ పిటిషన్ కొట్టివేత

అమరావతి: మాజీ మంత్రి, టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈఎస్‌ఐ కేసులో దాఖలైన అన్ని బెయిల్ పిటిషన్లను ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈఎస్‌ఐ స్కాంలో నిందితులుగా ఉన్న రమేశ్ కుమార్, మురళి, సుబ్బారావు బెయిల్ మంజూరు చేయాలని దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ప్రస్తుతం గుంటూరు రమేశ్ ఆసుపత్రిలో అచ్చెన్నాయుడు చికిత్స పొందుతున్నారు. ఈఎస్‌ఐ మందుల కొనుగోళ్లకు సంబంధించిన ఆరోపణలపై గత నెల 12న ఏసీబీ అధికారులు అచ్చెన్నాయుడును శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.




# ఒక్కరోజులో 10వేల కేసులు

### బులిటెన్ విడుదల చేసిన వైద్య, ఆరోగ్య శాఖ




అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి విజృంభణ కొనసాగుతోంది. ఇవాళ రికార్డు స్థాయిలో పాజిటివ్ కేసులు నమోద య్యాయి. రాష్ట్రంలో గత 24 గంటల్లో (9%ఎ-9ఎ%) 70,584 నమూనాలను పరీక్షించగా 10,093 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 1,20,390కి చేరింది. ఇవాళ కొవిడ్-19 నుంచి 2,784 మంది కోలుకోగా.. మొత్తం 55,406 మంది కోలుకుని డిశ్చార్జి అయినట్లు ప్రభుత్వం తెలిపింది. వివిధ కొవిడ్ ఆసుపత్రుల్లో 63,771 మంది చికిత్స పొందుతున్నట్లు బులిటెన్‌లో పేర్కొంది.

గడిచిన 24 గంటల్లో మరో తూర్పు గోదావరిలో 14, అనంతపురం 8, విజయనగరం 7, చిత్తూరు 6, కర్నూలు, నెల్లూరులో ఐదురుగురేసి, కృష్ణ, ప్రకాశం జిల్లాల్లో నలుగురేసి, గుంటూరు, కడపలో ముగ్గురు, శ్రీకాకుళం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాలో ఇద్దరేసి ఇవాళ మృతి చెందారు. కరోనాతో ఇప్పటి వరకు 1,213 మంది ప్రాణాలు కోల్పోయారు. నేటి వరకు రాష్ట్రంలో 18,20,009 నమూనాలను పరీక్షించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## లాక్‌డౌన్ ఉల్లంఘించిన వారిపై..

# పోలీసులకు పూర్తి స్వేచ్ఛ

### మంత్రి పేర్ని నాని



కృష్ణా: కరోనా పాజిటివ్ కేసులు రోజు రోజుకు ఉధృతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆగస్టు 3 నుంచి 9 వరకు మచిలీపట్నంలో సంపూర్ణ లాక్‌డౌన్ అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్ని నాని తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. 'మచిలీపట్నంలో

తరువాయి 2లో..

# కరోనా నిబంధనలు పాటిస్తూ బక్రీద్

శ్రీకాకుళం : బక్రీద్ పండగను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మసీదులు, ఈద్గాలలో చేసుకోవచ్చని జిల్లా మైనారిటి సంక్షేమ అధికారి ఎం.అన్నపూర్ణమ్మ తెలిపారు. ఈ మేరకు బుధ వారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆగస్టు 1వ తేదీన బక్రీద్ పండగ ఉందని, బక్రీద్ ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సూచనలను అనుసరించి నిర్వహించుకోవాలని ఆమె స్పష్టం చేసారు. 65 సం.లు పైబడిన వారు, గర్భిణి స్త్రీలు, చిన్న పిల్లలు, హృద్రోగ సమస్యలు, ఇతర దీర్ఘకాల సమస్యలు, జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నవారికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని ఆమె అన్నారు. మసీదుల వద్ద జరుగు ప్రార్ధనలలో ఒకసారి 50 మంది ముజల్లీ కి మాత్రమే అనుమతించడం జరిగిందని అన్నపూర్ణమ్మ చెప్పరు. వ్యక్తుల మధ్య విధిగా రెండు మీటర్ల భౌతిక దూరం పాటించాలని అన్నారు.

మసీదులు, ఈద్గాలను పూర్తిగా శానిటైజర్ తో శుభ్రపరచాలని ఆమె సూచించారు. చరవాణిలలో “ఆరోగ్యసేతు యాప్’ ను డౌన్ లోడ్ చేసుకోవాలని అన్నారు. ప్రార్ధనకు ఎవరి తివాచీ వారు తీసుకు రావాలని సూచించారు. మత పెద్దలు, కమిటీ నిర్వహకులు తగు శ్రద్ధ తీసుకొని కరోనా మహమ్మారి భారీన పడకుండా మైకు ద్వారా రక్షణాత్మ సూచనలు చేయాలని, మసీదులు, ఈద్గాల వద్ద కరోనాపై అవగాహన కలుగుటకు ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రార్ధనలలో విధిగా భౌతిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని, చేతికి గ్లోవ్స్ ధరించాలని, చేతులను తరచూ సబ్బుతో లేదా శానిటైజర్ తో శుభ్రపరచుకోవాలని ఆమె చెప్పారు. మసీదు, ఈద్గాల పరిసరాలలో ఉమ్మి వేయరాదని ఆమె పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఆచరించే కరచాలనాలు, ఆలింగనాలు చేయరాదని అన్నారు. కరోనా మహమ్మారి బారిన పడకుండా, అన్ని జాగ్రత్తలు తీసుకుని ఎవరికి వారే రక్షణ చర్యలు చేపట్టాలని, మీరు మీ కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉండాలని పేర్కొంటూ సురక్షిత జీవనంలో అందరూ భాగస్వామ్యం వహించుటకు ప్రార్ధనలు చేయాలని కోరారు. కరీనాకి నువ్వు ఒక ప్రాణం మాత్రమే, కానీ కుటుంబానికి నువ్వొక అమూల్యమైన మనిషివి - మన భద్రత మనమే తీసుకోవాలి అని ఆమె పిలుపునిచ్చారు.

## ఎంఎస్ఎంఇలు ఉద్యం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

శ్రీకాకుళం : సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు(ఎం.ఎస్.ఎం.ఇలు) ఉద్యం రిజిస్ట్రేషన్ విధిగా చేయించుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ బి.గోపాలకృష్ణ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎం.ఎస్.ఎం.ఇలను తరగతి వారీగా నమోదు చేయు విధానాన్ని సరళీకృతం చేసి జూలై 1వ తేదీ నుండి ఉద్యం రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఎం.ఎస్.ఎం.ఇలు ఇప్పటి వరకు ఉద్యోగ్ ఆధార్ మెమోరాండమ్(యు.ఎ.ఎం)లో నమోదు చేసే వారని ఇకపై ఉద్యం రిజిస్ట్రేషన్ లోనే నమోదు చేయాలని సూచించారు. యంత్ర సామగ్రి, పరికరాల మీద పెట్టుబడి కోటి రూపాయల వరకు ఉండి, అమ్మకం టర్నోవర్ రూ 5 కోట్లు వరకు ఉన్న పరిశ్రమలను సూక్ష్మ తరహా పరిశ్రమలుగాను., యంత్ర సామగ్రి, పరికరాల మీద పెట్టుబడి 10 కోట్ల రూపాయల వరకు ఉండి, అమ్మకం టర్నోవర్ రూ 50 కోట్లు వరకు ఉన్న చిన్నతరహా పరిశ్రమలుగాను., యంత్ర సామగ్రి, పరికరాల మీద పెట్టుబడి 50 కోట్ల రూపాయల వరకు ఉండి, అమ్మకం టర్నోవర్ రూ 250 కోట్లు వరకు ఉన్న మధ్యతరహా పరిశ్రమలుగాను కేంద్ర ప్రభుత్వం విభజించిందని వివరించారు. ఈ విభజన ప్రకారం ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమలు, సంబంధించిన పారిశ్రామిక వేత్తలు http://udyamregistration.gov.in లో వివరాలు నమోదు చేసుకొని ఉద్యం రిజిస్టేషన్ ను పొందవచ్చని చెప్పారు. గతంలో పర్మినెంట్ రిజిస్ట్రేషన్ తీసుకున్న వారు, తీసుకోనివారు, పార్ట్- రిజిస్ట్రేషన్ తీసుకున్న వారు, తీసుకోనివారు, ఉద్యోగ ఆధార్ తీసుకున్న వారు, తీసుకోనివారుతో సహా ఇంత వరకు ఎటువంటి రిజిస్ట్రేషన్ తీసుకోని పాత వారు, కొత్తగా ఉత్పత్తి ప్రారంభించిన వారు అందరూ కూడా తప్పనిసరిగా ఉద్యమం రిజిస్ట్రేషన్ పొందాలని ఆయన స్పష్టం చేసారు.

రిజిస్ట్రేషన్ పొందని ఎం.ఎస్.ఎం.ఇలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఏటువంటి సహాయం ఉండదని ఆయన వివరించారు. ఈ విషయాన్ని ఎం.ఎస్.ఎం.ఇ రంగంలోని వారు వెంటనే ఉద్యం రిజిస్ట్రేషన్ పొందాలని ఆయనసూచించారు.

## ఆన్‌లైన్ లో జాతీయస్థాయి సెమినార్లు

**- డా. బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం వినూత్న ప్రయత్నం**
**- జాతీయ స్థాయిలో ప్రప్రథమం**
**- ఉన్నత పాఠశాల విద్యార్థుల నుండి పీజీ విద్యార్థుల వరకు అవకాశం**



శ్రీకాకుళం : కోవిడ్ 19 మహమ్మారితో విద్యాలయాల పరిస్థితి, విద్యార్థుల భవిత ప్రశ్నార్ధకం కాగా, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోగల డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం వినూత్న ప్రయోగాలతో ముందుకు వెళుతోంది. కోవిడ్ 19 మహమ్మారి ఒక వైపు నుండి ప్రజలను కదలనీయని స్థితిలోకి నెట్టడంతో విద్యార్థులు తరగతి గదుల్లో బోధనలు కోల్పోవడం జరిగింది. ఈ తరుణంలో విశ్వవిద్యాలయం జూన్ నెల నుండి ఆన్ లైన్ లో వివిధ సెమినార్లను నిర్వహిస్తూ విద్యార్థులు, ఆచార్యులు తమ పరిజ్ఞానం పెంపొందించుకోవడం, ఇతరులతో పంచుకోవడం జరిగింది. తాజాగా ఉన్నత పాఠశాల విద్యార్థుల నుండి పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయి వరకు తమలో నిఘూడంగా దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసుకురావడానికి విశ్వవిద్యాలయం ఒక మంచి ప్రయత్నం ప్రారంభించింది. 73వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేషనల్ రిసెర్చ్ డెవలప్ మెంటు కార్పొరేషన్, లారస్ లాబ్ ల సౌజన్యంతో విద్యార్థుల సృజనాత్మక శక్తులను వెలికితీసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆగష్టు 8వ తేదీ వరకు విద్యార్థుల నుండి వివిధ అంశాలపై మోడల్స్, పత్రాలు స్వీకరిస్తుంది. సమర్పించిన మోడల్స్, పత్రాల్లో అత్యుత్తమ అంశాలను ఎంపిక చేసి బహుమతులను కూడా భారీగా అందజేయుటకు నిర్ణయించింది. మూడు మొదటి బహుమతులుగా లక్ష రూపాయలు చొప్పున, మూడు ద్వితీయ బహుమతులకు రూ.50 వేలు చొప్పున, మూడు తృతీయ బహుమతులుగా రూ.25 వేలు చొప్పున అందించనున్నారు.

విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పొఫెసర్ కె.రఘుబాబు మాట్లాడుతూ కోవిడ్ కారణంగా విద్యార్థులకు తరగతులు నిర్వహించే పరిస్థితి లేదన్నారు. ఈ తరుణంలో విద్యార్థుల తెలివితేటలకు పదును పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయుటకు సెమినార్లను ఉద్దేశించామని చెప్పారు. హైస్కూల్ నుండి పి.జి స్థాయి విద్యార్థులు ఇందులో పాల్గొనుటకు అవకాశం కల్పించామని, ప్రతి బృందంలో 5 గురు వరకు విద్యార్థులు, ఒక మెంటార్ ఉండవచ్చని ఆయన చెప్పారు. ఆగష్టు 8వ తేదీ నాటికి విద్యార్థులు తమ వ్యాస పత్రాలు, మోడల్స్ సమర్పించవచ్చని, ఎంపిక చేసిన పత్రాలు, మోడల్స్ ను ఆగష్టు 9 నుండి 14వ తేదీ మధ్య ఆన్ లైన్ లో విద్యార్థులు ప్రదర్శించాలని చెప్పారు. వాటిలో అత్యుత్తమ మోడల్స్ ఎంపిక చేసి ఆగష్టు 15వ తేదీన తుది ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని రఘు పేర్కొన్నారు. దేశం నలుమూలల నుండి విద్యార్థులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొంటూ ప్రస్తుత తరుణంలో దేశాభివృద్ధిలో యువత పాత్ర గణనీయంగా ఉందని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని మంచి సూచనలు సలహాలు అందించాలని కోరారు. ఆన్ లైన సెమినార్లపై విద్యార్థులకు, మెంటార్లకు అవసరమగు సమాచారం కోసం ప్రొఫెసర్ కె.రఘుబాబు, 9440114243 లేదా drraghualways@yahoo.co.in కు సంప్రదించవచ్చని చెప్పారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం వెబ్ సైట్ www.brau.edu.in ను కూడా సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

## పోషకాహార ధరలు పై, పైకీ....




కంచరపాలెం : ప్రస్తుతం కరోనా విజ్రంభిస్తున్న నేపథ్యంలో పేద , ధనిక అనే తేడా లేకుండా పౌష్టిక ఆహారం గురించి ప్రతి ఒక్కరు పరుగులు తీస్తున్నారు. ముక్యంగా వ్యక్తి గత శుభ్రత గురించి ప్రతి ఒక్కరు వాడే ముక్య ఔషధం “ డెటాల్ “ ప్రస్తుతం మార్కెట్ లో కనిపించటం లేదు ... !

అలాగే కరోనా విరుగుడు విటమిన్ “ సి “ డి “ లో వున్నాయని ప్రచారం జోరుగా సాగడంతో ప్రస్తుతం విటమిన్ “ సి “ డి “ ట్యాబ్ లెట్స్ మెడికల్ స్టోర్ లలో సైతం లభించడక పోవడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా ఇంట్లో ఉన్న చిన్నారుల ఆరోగ్య సమస్యలపై బయన్దోలన చెందుతున్న తల్లి దండ్రులు బజారులో పోషక విలువలున్న “ బాదం , అక్రూట్ “ గురించి పరుగులు తీస్తున్నారు . అయితే వీరి అవసరాలను క్యాష్ చేసుకుంటున్నారు వ్యాపారులు ..

గతంలో ఉన్న ధరలకంటే అదికంగా “ బాదం , ఆక్రూట్ “ లు విక్రయిస్తున్నరని ఆరోపిస్తున్నారు. ఇదిలా వుంటే మర్కెట్ , కిరాణా జనరల్ స్టోర్స్ లలో , మెడికల్ షాప్ ల వద్ద విరివిగా లభించే “ డెటాల్ “ మచ్చుకైనా కనిపించకపోవటంతో వినియోగ దారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే నిత్యం మెడికల్ , జనరిక్ స్టోర్ లలో కనిపించే విటమిన్ “ సి “ డి “ ట్యాబ్ లెట్స్ లు కొత్త , కొత్త కంపెనీలు దర్శనిమిస్తున్నాయని వినియోగ దారులు ఆరోపిస్తున్నారు .

ముక్యంగా కోవిడ్ సోకకుండ ఆవిరి పట్టేందుకు వాడే వాపోరిజర్ లిక్విడ్ మాత్రలు . మెడికల్ షాప్ లలో కనిపించకపావటం కోస మెరుపు ... !

మరో ప్రక్క రోజుకొక కంపెనీల పేరుతో బజారులో శనిటైజర్ లు అమ్మకాలు జారుగా సాగుతున్న సంబందిత అదికారులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ అదికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు .

## వృద్ధులతో సంతోష్ బరాటం జన్మదిన వేడుకలు



మధురవాడ : మహా విశాఖ జోన్ 1 పరిధి 7 వ వార్డులో ధి పి.అర్ గ్రూప్ సంస్థ అధినేత మరియు జనసేన వార్డు నాయకులు సంతోష్ బరాటం జన్మదిన వేడుకలును అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మధురవాడ లో స్థానిక వైజాగ్ ఓల్టేజ్ హెూమ్ లోని వృద్దులకు మధ్యాహ్నం భోజనం ను ఏర్పాటు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా ఈ వేడుకను నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ స్పూర్తితో ఈరోజు వరకు ఎన్నో కార్యక్రమాలు చేశానని, భవిషత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చెయ్యనున్నానని తెలిపారు. అనంతరం జనసేన భీమిలి పార్టీ కార్యాలయంలో ఘనంగా కేక్ కటింగ్ ను నిర్వహించారు.కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇంచార్జి డా?సందీప్ పంచకర్ల,బి.వి. కృష్ణయ్య,శేఖరి శ్రీను బాబు , నాగొతి నర్సినాయుడు, ప్రసాద కుభీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం వ్యతిరేక ప్రచార కమిటీ సేవలు అమోఘం

**విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్**




విజయనగరం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ సభ్యులు విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి. రాజకుమారి, ఐపిఎస్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బేతా సురేష్ రాష్ట్ర మద్య విమోచన కమిటీ రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేదానికి చేస్తున్న కృషిని, చేపడుతున్న చర్యలను జిల్లా ఎస్పీకి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్య నిషేదాన్ని విధించేందుకు2024ను లక్ష్యంగా నిర్ణయించుకున్న నేపథ్యంలో మేధావులు, మంత్రివర్యులు, ప్రభుత్వ అధికారులతో మద్య విమోచన కమిటీగా ఏర్పడినట్లు, ఈ కమిటీకి ప్రతీ జిల్లాలోను సభ్యులు ఉన్నట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్య విమోచన ప్రచార కమిటీ సభ్యులు ఆయా జిల్లాల్లో మద్య విమోచనకు తమవంతుగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి 2024కు సంపూర్ణ మద్య నిషేదం అమలు చేయనున్నందున ఇప్పటి నుండే ప్రజలకు మద్యం, మత్తు పదార్ధాల వలన కలిగే అనర్ధాలను వివరించి, వారిని చైతన్యపరుస్తున్నామన్నారు. అనంతరం, రాష్ట్ర మద్యవిమోచన ప్రచార కమిటీ సభ్యులు రూపొందించిన ‘మద్యం వద్దు - కుటుంబం ముద్దు’ అన్న ప్రచార హెూర్డింగును జిల్లా ఎసీ బి. రాజకుమారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మద్య నిషేదానికి ప్రభుత్వ నిబంధనలు మేరకు సారా అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఎస్ఈబి ఆధ్వర్యంలో దాడులను విస్తృతం చేసామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం



ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, దీని కోసం తగిన సహాయం అందించాలని కోరారు. ప్రతి ఆర్బీకేలో ఈ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. ప్రతి మండలానికీ కోల్డ్ స్టోరేజీ, కోల్డ్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్బీకేల ద్వారా రైతు ఉత్పత్తుల సమాచారాన్ని సెంట్రల్ సర్వర్‌కు అనుసంధానం చేసి వారి మార్కెటింగ్‌కు సహకారం అందిస్తామని సీఎం చెప్పారు.

రాష్ట్రంలో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులకూ తగిన సహకారం అందించాలని ఆర్థికశాఖ అధికారులు బ్యాంకర్లను కోరారు. గోదావరిలో వరద జలాలను వినియోగించుకోవడానికి బృహత్ ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని, దీనికి తగిన విధంగా తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల రుణాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని బ్యాంకర్లను కోరారు.

## దాచాల్సిన అవసరం లేదు

సంఖ్య మరో మూడు పెంచుతున్నాం. వైద్యులు, నర్సులు, ఇతర స్టాఫ్ రిక్రూట్మెంట్ కూడా చేపడుతున్నాం. జిల్లాలో 2 కోవిడ్ సెంటర్లకు అదనంగా మరో రెండు సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. కోవిడ్ మరణాలు కూడా దాచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు’ అని మంత్రి ఆళ్లనాని తెలిపారు.

## ఒక్కరోజులో 10వేల కేసులు

కరోనాను కట్టడి చేయడంలో భాగంగా టాస్క్‌ఫోర్స్ కమిటీ అభిప్రాయం సేకరించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. ఉదయం 6 నుంచి 9 వరకు నిత్యావసరాలకు అనుమతిస్తున్నాం. మిగిలిన వ్యాపారాలన్నీ కూడా పూర్తిగా మూసివేయబడతాయి. బస్సులు, ఆటోలు, మోపెడ్‌లు రోడ్లపై తిరగ రాదు. అందరూ కూడా లాక్‌డౌన్‌కు సహకరించాలి.

ంవారం రోజులపాటు మచిలీపట్నంలోకి రావడానికి గాని, మచిలీపట్నం నుంచి బయటకు వెళ్లడం గాని చేయకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు, వ్యవసాయ కూలీలు సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకుని వ్యవసాయ పనులకు వెళ్లాలి. కరోనా నిర్ధారణ పరీక్షల్లో సగటున 45% పాజిటివ్‌లు రావడం చాలా విచారకరం. మచిలీపట్నంలో బక్రీద్ నాడు ముస్లిం సోదరులు ఇంట్లోనే నమాజ్ చేసుకోవాలని, ముఖ్యంగా 60 సంవత్సరాల వయసున్నవారు, చిన్నపిల్లలు బయటకు రావొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. లాక్‌డౌన్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం’ అని మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు.

## 400 మందికి సరిపడే క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటు



పశ్చిమగోదావరి: క్వారంటైన్‌కి వచ్చే పేషెంట్స్‌కు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, రెవెన్యూ శాఖ అధికారులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. ఆచంట నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న కోవిడ్ క్వారంటైన్ కేంద్రాలని మంత్రి బుధవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెనుగొండ ఎస్వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల, నెగ్గిపూడి ఆచార్య ఎన్జీ రంగా రైతుభవనంలో సుమారు 400 మందికి సరిపడే క్వారంటైన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. రోజురోజుకి కేసులు అధికమవుతుండటంతో నియోజకవర్గంలో ఉన్న కళాశాలలు, స్కూల్స్‌ను ప్రజలకు దగ్గరగా క్వారంటైన్ కేంద్రాలుగా మారుస్తున్నాం. నియోజవర్గ ప్రజలలో కోవిడ్ లక్షణాలు కలిగిన వారిని, పాజిటివ్ వచ్చిన వారిని పాలకొల్లు, ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, క్వారంటైన్ కేంద్రాలకి తరలిస్తున్నారని అక్కడ బాధితులు పెరిగిపోవడంతో నియోజక వర్గ ప్రజలకు దగ్గరగా ఏర్పాటు చేస్తున్నాం. సోమవారం నుంచి నియోజకవర్గంలో క్వారంటైన్ కేంద్రాలను ప్రారంభిస్తామని మంత్రి శ్రీరంగనాథరాజు

## దర్శకుడు రాజమౌళికి కరోనా పాజిటివ్



హైదరాబాద్: దేశంలో కరోనా మహమ్మారి రోజురోజుకీ ఉద్ధృత రూపం దాల్చుతోంది. ఈ వైరస్ సామాన్యులనే మాత్రమే కాదు ప్రముఖులను సైతం వణికిస్తోంది. తాజాగా ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి కరోనా బారినపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ట్విటర్‌లో పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా తాను, తన కుటుంబ సభ్యులకు స్వల్పంగా జ్వరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షలు చేయించుకోగా.. ఇవాళ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ఆయన వెల్లడించారు. వైద్యుల సలహా మేరకు ఇంట్లోనే స్వీయ నిర్బంధంలో ఉన్నట్టు చెప్పారు. తమలో ఎవరికీ కరోనా లక్షణాలు లేకపోయినప్పటికీ అన్ని నిబంధనలూ పాటిస్తున్నామని తెలిపారు.

## *అమెరికాలో భారతీయ నర్స్ దారుణ హత్య!*

మియామీ: కేరళకు చెందిన ఓ నర్స్ అమెరికాలో దారుణ హత్యకు గురయ్యింది. కొట్టాయంకు చెందిన మెరీన్ జాయ్(26)తన భర్తతో కలిసి ఫ్లోరిడాలో నివసిస్తోంది. అక్కడే ఉన్న ఆసుపత్రిలో మెరీన్ నర్సుగా సేవలందిస్తోంది. అయితే, గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. మంగళవారం ఉదయం మెరీన్ తన విధులను ముగించుకొని ఆసుపత్రి నుంచి ఇంటికి బయలుదేరింది. అదే సమయంలో పార్కింగ్ స్థలంలో వేచివున్న ఆమె భర్త ఫిలిప్ మ్యాథ్యూ కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో తీవ్రగాయాలైన మెరీన్‌ను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించినట్లు పోలీసులు వెల్లడించారు.

## జె-గేట్ విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నన్నయ విశ్వవిద్యాలయం : జర్నల్ సాహిత్యంలో భారీ డేటాబేస్‌గా ఉన్న జె-గేట్ వే విజ్ఞాన సేవలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కొనుగోలు చేసిందనీ, దీనిని క్యాంపస్‌లో విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కేంద్రీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో ‘జె-గేట్ వన్ ప్లాట్‌ఫామ్ టూ డిస్కవర్ ఆల్ స్కోలర్లీ ఈ-జర్నల్ లిటరేచర్’ అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. దీనికి కన్వీనర్‌గా కె.రమణేశ్వరి, కోకన్వీనర్‌గా సింహాచలం వ్యవహరించగా వీసీ హాజరై జె-గేట్ వే సేవలను ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ, వర్సిటీని శాస్త్రీయమైన పరిశోధనలవైపు నడిపేందుకు జర్నల్ గేట్ వేలను కొనుగోలు చేశామన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో రీసెర్చ్ కేంద్రాలకు ఈ సేవలను అందిస్తామని, వినియోగించుకునేందుకు క్యాంపస్‌లో ఉన్నవారికి వ్యక్తిగత ఐడీలు ఇస్తామన్నారు.

త్వరలో జె-స్టోర్ విజ్ఞాన సేవలను కొనుగోలు చేయనున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ఈసీ సభ్యులు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య టి.అశోక్, బి.జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పెర్సిస్, డి.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

# గాజువాక అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ హామీ

## - గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి




గాజువాక : నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలందిస్తానని ,దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేర్కొన్నారు. బిసి రోడ్ టిఎన్ఆర్ కళ్యాణమండపంలో బుధవారం పాత్రకేయుల సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి ముందుగా ఇటీవల గుండెపోటుతో మరణించిన వార్తా విలేఖరి ఎం వి జి ప్రసాద్ కు సంతాపం తెలియజేసారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా అపరిష్కరంగా ఎన్నో సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని, వాటిలో అతి ముఖ్యమైనవి హౌస్ కమిటి సమస్య ఒకటి , రెండోది స్టీల్ ప్లాంట్ ఆర్ కార్డుల బదిలీ , మూడోది గంగవరం గ్రామం తరలింపు , నాలుగోది గంగవరం పోర్టు కాలుష్యం, ఐదోది గాజువాక మర్కెట్ కోసం 5 ఎకరాల స్థలం కెటాయింపు , ఆరోది ఆదర్శ గ్రౌండ్ లో స్టేడియం ఏర్పటు వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిసి కోరామన్నారు. సుమారు ఒక గంట పాటు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో జరిగిన భేటిలో నియోజకవర్గ సమస్యల ప్రస్తావనే కాకుండా, నియోజక వర్గ అభివృద్ధికి, చేయవలసిన కార్యక్రమాల ప్రస్తావన కొనసాగిందన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా నియోజక వర్గం అభివృద్ధికి నోచుకోలేదనీ ఇప్పుడు వైకాపా ప్రభుత్వ హయాంలో గాజువాక నియోజకవర్గంలో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరం అవుతాయి అని ప్రజలందరూ విశ్వసిస్తున్నారని సీఎం జగన్ మోహన్ రెడ్డికి చెప్పినట్లు తెలిపారు.

ఈ సమస్యలపై సానూకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరించి, నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేద్దామని భరోసా ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనాయకులు మంత్రి రాజశేఖర్, జిల్లా ప్రధానకార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షులు తిప్పల వంశీ రెడ్డి, రాజాన వెంకటరావు, కేబుల్ మూర్తి, వెంపాడ అప్పారావు, దొడ్డి రమణ, ధర్మాల శ్రీను, రెడ్డి జగన్నాథం, మంత్రి శంకర్ నారాయణ, సన్నీ , ఎండి ఇమ్రాన్, షౌకత్ అలీ, బ్రమ్మయ్య, వేణుబాబు, దానప్పలు, సంపంగి ఈశ్వరరావు, ఉరుకుటి చందు, రంబా నారాయణమూర్తి, చెల్లిబోయిన నాయుడు, భూపతిరాజు శ్రీనివాసురాజు, భూపతిరాజు సుజాత, మంత్రి మంజుల, జుత్తు లక్ష్మీ, చిత్రాడ వెంకటరమణ, బొడ్డా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ కేర్ సెంటర్లలో పేషంట్లకు నాణ్యమైన పౌష్టికాహారం

## జాయింట్ కలెక్టర్ - 3 గోవిందరావు



విశాఖపట్నం : కోవిడ్ కేర్ సెంటర్లలో పేషంట్లకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ - 3 గోవిందరావు తెలిపారు. బుధవారం నాడు జాయింట్ కలెక్టరు , ఆర్ డి ఓ, పి.కిశోర్ తో కలిసి మారికవలసలోని గిరిజన బాలికల కళాశాల భవనంలో ఏర్పాటు చేసిన వంటశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ప్రభుత్వ మానసిక వైద్యశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.నాగరాజు, డిప్యూటీ తాహశీల్దార్ రవి కుమార్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ నరసింహ మూర్తి కోవిడ్ కేర్ సెంటర్ లోని రోగుల ఆరోగ్య పరిస్థితిని, భోజన , వసతి వివరాలను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టరు మాట్లాడుతూ విశాఖనగరంలో కోవిడ్ పరీక్షలు చేయించుకొని పాజిటివ్ వచ్చిన వ్యక్తులను ఈ కోవిడ్ కేర్ సెంటర్లలో ఉంచి , 24గంటలు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. మొత్తం 12 మంది డాక్టర్లు, 6 మంది నర్సులు, వున్నారని , మూడు భవనాలలో ప్రతి షిఫ్టులోను 1 డాక్టరు, 1 నర్సు ఉంటారని తెలిపారు. ఎవరికైనా అనారోగ్య పరిస్థితి తలెత్తితే తక్షణమే అంబులెన్స్ లో కోవిడ్ ఆసుపత్రికి తరలిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భోజన , వసతి సౌకర్యాలను పరిశీలించామని తెలిపారు. శ్రీ చైతన్య కాలేజీ భవనాల లో మూడు బ్లాకులు ఉన్నాయని, అందులో అబ్దుల్ కలామ్ భవనంలో ఇప్పటి వరకు 379 మంది ఎడ్మిట్ కాగా 164 మంది పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి అయ్యారని, 71 మంది హోం ఐసోలేషన్ లో వున్నారని, 9 మందిని కోవిడ్ ఆసుపత్రికి రిఫర్ చేసామని తెలిపారు. ప్రస్తుతం 135 మంది మహిళా పేషెంట్లు ఉన్నారని ఈ భవనాన్ని ప్రత్యేకంగా మహిళల కోసం కేటాయించారని తెలిపారు.ఈ భవనంలో మొత్తం 390 బెడ్స్ ఉన్నాయని తెలిపారు. భగీరధ బ్లాక్ లో 180 రూమ్ లు , 500 బెడ్స్ ఉన్నాయని, ఇప్పటివరకు 293 మంది ఎడ్మిట్ కాగా, 13 మంది డిశ్చార్జి అయ్యారని, 20 మంది హోం ఐసోలేషన్ లో వున్నారని, 8 మందిని కోవిడ్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 252 మంది పేషంట్లు ఉన్నారని తెలిపారు. వాల్మీకి బ్లాక్ లో 160 రూమ్ లు, 480 బెడ్స్ ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 516 మంది ఎడ్మిట్ కాగా, ఒకరు డిశ్చార్జి అయ్యారని, 241 మంది హోం ఐసోలేషన్ లో వున్నారని, 14 మందిని కోవిడ్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 260 మంది పేషంట్లు ఉన్నారని అందులో 155 మంది పురుషులు, 105 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. వీరికి ఉదయం 7గంటలకు రాగి జావ, పాలు ఇస్తున్నారని, ఉదయం 8.30 గంటలకు అల్పాహారంగా ఇడ్లీ, వడ , పూరి, చపాతి, టీ, కాఫీలు ఇస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భోజనంలో రోటి, రైస్, చికెన్ కర్రీ, వెజిటబుల్ కర్రీ, ఆకుకూర, పప్పు, సాంబారు, పెరుగు, అరటిపండు ఇస్తున్నారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు టీ, కాఫీ ఇస్తున్నారని తెలిపారు. రాత్రి 7.30 గంటలకు భోజనంలో రోటి, రైస్, గుడ్డు, వెజిటెబుల్ కర్రీ, ఆకుకూర, పప్పు, సాంబారు, పెరుగు, అరటి పండు ఇస్తున్నారని తెలిపారు.

### మత్స్యకారులు తుఫాను సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం



భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ కే. కన్నబాబు ఐ.ఏ.ఎస్ తో ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు, వైయస్సార్ సిపి నాయకులు. వాసుపల్లి జానకిరామ్ కలిసి రాష్ట్రంలో తీరప్రాంత మత్స్యకారులు తుఫాను సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా తుఫాన్ లో వాతావరణం ప్రభావం సముద్ర తీరప్రాంతం కోతకు గురికావడం వలన మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి జానకిరామ్ తీసుకుని వచ్చారు. హుదూద్ తుఫాను వలన ఉత్తరాంధ్ర నుంచి తూర్పు గోదావరి జిల్లా వరకు సముద్ర తీరం కోతకు గురికావడంతో చేపడుతున్న పునరుద్ధరణ పనులను కమిషనర్ జానకి రామ్ కి వివరించారు. ముఖ్యంగా 2014 లో హుదూద్ వల్ల భీమిలి సముద్ర తీర ప్రాంతం కోతకు గురికావడంతో రక్షణ గోడ నిర్మాణం ఏర్పాటుకు సంబంధించిన వివరాలపై ప్రశ్నించగా గత ప్రభుత్వం భీమిలి కి సంబంధించి తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సాధించలేదని, అందువల్ల శాస్త్రీయ పరిశోధన జరగలేదని, సరైన రిపోర్టు లేకపోవడం వల్ల పనులు ప్రారంభం కాలేదని కమిషనర్ తెలిపారు. ప్రస్తుతం భీమిలి తీర ప్రాంతం ఎందుకు కోతకు గురవుతుంది అనే అంశంపై సైంటిఫిక్ రీసెర్చ్ అథారిటీ పరిశీలించిన రిపోర్టు రావాల్సి ఉందని రిపోర్ట్ వచ్చిన తర్వాత డీ. పి. ఆర్ (డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారుచేసి ప్రభుత్వ అనుమతితో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని వాసుపల్లి జానకి రామ్ కు కమిషనర్ వివరించారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని ఉప్పాడ లో బీచ్ పునరుద్ధరణ పనులు ప్రారంభించామని, అనుమతి వచ్చిన తరువాత భీమిలి బీచ్ పునరుద్ధరణ పనులను ప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో యువజన సమాఖ్య కార్యదర్శి బడే ఎల్లాజీ పాల్గొన్నారు.

# చీకటి పడితే అంతే...

## - వెలగని వీధి దీపాలు

## - పట్టించుకోని పంచాయతీ అధికారులు



లంకెలపాలెం: పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాలలో గత కొంతకాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో గ్రామస్తులు చీకటి పడితే బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వీధి దీపాల సమస్య పై పలుమార్లు పంచాయతీ కార్యదర్శి కి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళలో బయటి నుంచి ఇంటికి వెళ్లాలన్నా, ఇంటి నుంచి బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చూడాలని గ్రామ వాసులు కోరుతున్నారు.

# రసాలమ్మ కాలనీ అభివృద్ధికి కృషి



గాజువాక : ఏళ్ళతరబడి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న రాసలమ్మ కాలనీని అభివృద్ధి బాట పట్టించేందుకు తన సొంత నిధులతో కృషి చేస్తున్నట్లు 86వ వార్డు వైసీపీ కార్పోరేటర్ అభ్యర్థి దామా సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం రసాలమ్మ కాలనీ లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత నిధులతో కాలువలు, డ్రైనేజీలు సిసి రోడ్డులు నిర్మిస్తున్నామన్నారు. 86వ వార్డు అభివృద్ధి కి ప్రత్యేక చొరవ చూపిస్తున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వార్డులో పేర్కుపోయిన సమస్యలను త్వరగతిన పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేసారని దామా సుబ్బారావు తెలిపారు. ఏన్నో ఏళ్ళగా అసంపూర్తిగా మిగిలిన ఖాళీ స్థలం వలన పందులు, కుక్కలు గ్రౌండ్ లోకి చేరడంతో స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బం దులకు గురి అవుతున్నారని, ఈ నేపధ్యంలో రాసలమ్మకాలనీ ప్రజల అభ్యర్థన మేరకు అసంపూర్తిగా మిగిలిన గ్రౌండ్ చుట్టు గోడను నిర్మిస్తున్న నిర్మాణ పనులను దామా సుబ్బారావు పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు రాము, నాయుడు, బలిరెడ్డి పెంటా రావు, ఆర్మీ రాజు తదితరులు పాల్గున్నారు.

# అప్పన్న హుండీ ఆదాయం రూ.21 లక్షల 24 వేలు



సింహాచలం : శ్రీ సింహాద్రి నాధుని హుండీ లెక్కింపు కార్యక్రమం సింహగిరి పై బుధవారం నాడు ఆలయ అధికారులు చేపట్టారు భక్తులూ 23 రోజులకు గాను నగదు 21 లక్షల 24వేల 747 రూ లు సమర్పించగా బంగారం 21 గ్రాముల వెండి 4 కేజీ ల 550మిల్లీలు సింగ పూర్ 2 డాలర్స్ కథర్ 15 రియాధ్స్ లభించాయి ఈ లెక్కింపు కార్యక్రమం ఈఓ డీ బ్రమరాంబ పర్యవేక్షణ లో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్రీయమైన సర్వే జరిపి ఖచ్చితమైన తూర్పుకాపుల కుల గణన జరపాలి : సంఘం నాయకులు




సింహాచలం:శాస్త్రీయమైన సర్వే జరిపి ఖచ్చితమైన తూర్పుకాపుల కుల గణన జరగాలి తూర్పు కాపు సంఘము నాయకులు గొర్లె శ్రీనివాస నాయుడు అన్నారు బుధవారం సింహాచలం తూర్పుకాపు స్వంఘము కార్యాలయంలో తూర్పుకాపు నాయకుల సమావేశంలో ఇటీవల బిసి కార్పొరేషన్ లు ఏర్పాటు నిమిత్తం జరిగే సమీక్ష లో బిసి అధికారుల సమిక్ష లో అధికారులు తూర్పుకాపు %డ% గాజుల కాపు జనాభా ఆంధ్రప్రదేశ్ ఇటీవల రాష్ట్రంలో తూర్పు కాపు ,గాజుల కాపు .జనాభా 1518044 ( పదిహేను లక్షల పద్దెనిమిది వేళ లబైనాలుగు) ఉన్నట్లు గణాంకాల చూపిస్తున్నారు. ఇవి వాస్తవానికి విరుద్దముగా ఉన్నవి.రాష్ట్రంలో తూర్పుకాపులు సుమారు 51 లక్షల వరకు ఉన్నారు శ్రీకాకుళం,విజయనగరం,విశాఖపట్నం జిల్లాలోనే ప్రస్తుతం సుమారు 30 లక్షలకు పైగా తూర్పుకాపులు ఉంటారు వీరు కాక మిగిలిన10 జిల్లాలోను మరియు దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లిన వలస కార్మికులు,ఇతర వ్యాపకాల మీద వెళ్లిన వారు సుమారు 20 లక్షలు ఉంటారు. దీనిపై శాస్త్రీయమైన సర్వే జరిపి ఖచ్చితమైన తూర్పుకాపుల కుల గణన జరగాలి, లేకుంటే సంక్షేమ పథకాలలో,రాజకీయంగా రావలసిన అవకాశాలలో నష్టం జరుగుతుంది.కనుక ఉత్తరాంధ్ర మూడు జిల్లాలో గల మంత్రులు,పార్లమెంటు సభ్యులు,శాసనసభ్యులు ఇతర పెద్దలు చొరవ తీసుకోవాలి.లి లేనియెడల ఇప్పటికే నిరాదరణకు గురియగుచున్న తూర్పుకాపు జాతికి తీరని అన్యాయం జరుగుతుందని తెలియజేస్తున్నాము. దీని పై ఉత్తరాంధ్ర తూర్పుకాపు సంక్షేమ సంఘం మరియు రాష్ట్ర సంఘం

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో గౌరవ శాసనసభ సభ్యులు, మరియు గౌరవ పార్లమెంట్ సభ్యులు మరియు మంత్రివర్యుల ద్వారా ముఖ్యమంత్రి వర్యులు కు విన్నపము చేస్తామనని గొర్లె శ్రీనివాస నాయుడు అన్నారు అలాగే మేము కూడా జిల్లా ల వారిగా శాంపిల్ సర్వే చేసి నివేదిక తయారు చేసి ప్రజా ప్రతినిధులు ద్వారా ప్రభుత్వం దృష్టి కి తెస్తామని అన్నారు.

గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వై. ఎస్.జగన్ మోహన రెడ్డి గారు బిసి లకు మేలుచేసె దృకృధం తో ఉన్నారు కనుక మా సామాజిక వర్గానికి న్యాయం చేస్తారని, తెలిపారు అవసరం అయితే తూర్పుకాపు సామాజిక వర్గం కుల గణన చేసి మాకు న్యాయం చేయవలసిందిగా కోరుచున్నాను అని అన్నారు రాష్ట్ర కార్యదర్శి లోగిస గణేష్ మాట్లాడుతూ కులగణన చేసి మాకు న్యాయం చేయాలని అలాగే విశాఖపట్నం లో కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వటం లో జాప్యం జరుగుతోంది అని అన్నారు ఈ కార్యక్రమంలో గొర్లె శ్రీనివాస నాయుడు,లోగిస గణేష్,ఎన్ని భాస్కర్ రావు బంటుపల్లి ప్రసాద్,బంటుపల్లి అశోక్,గోపి,సిడగం శివ మొదలగు వారు పాల్గొన్నారు.

# పాలిసెట్ గడువు పొడిగింపు

భీమునిపట్నం : పాలిటెక్నిక్ కళాశాలల్లో 2020-21 విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ ఎంట్రన్స్ గడువును ఆగస్టు 4వ తేదీ వరకు పొడిగించారని భీమిలి ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి.వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

# ప్రేమ సమాజానికి అవసరమైన మందులు విరాళం

విశాఖపట్నం : రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ కొత్తగా ఎన్నికైన బృందం 2020 జూలై 29 న జూమ్ సమావేశం ద్వారా ఆన్‌లైన్‌లో తమ మొదటి సమావేశాన్ని నిర్వహించింది. జిల్లా 3020 జిల్లా గవర్నర్, రోటేరియన్ ఎం సతీష్ బాబు బోర్డు సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు మరియు ఒత్తిడితో కూడిన కోవిడ్ లాక్డౌన్ సమయంలో కూడా క్లబ్ చేపడుతున్న ప్రాజెక్టులను అభినందించారు.ప్రేమ సమాజం క్లినిక్ సేవలను ఉపయోగించుకునే ఇతర సాధారణ రోగులకు అవసరమైన మరియు ప్రాథమిక మందులను విరాళంగా ఇవ్వడం ద్వారా కమ్యూనిటీ ప్రాజెక్టును ఆయన ప్రశంసించారు. ఈ ప్రాజెక్ట్ ఖర్చు మందులను వచ్చే ఏడు నెలలకు నెలకు రూ?? 25,000 రూపాయలు చొప్పున ప్రేమ సమాజంకు ఇవ్వడం జరుగుతుంది. ప్రేమసమాజం 1930 లో స్థాపించబడిన ఒక స్వచ్ఛంద సంస్థ, దీని మొదటి అధ్యక్షుడు శ్రీ కంచర్ల రామబ్రహ్మం అతని కుటుంబ సభ్యులు. యాదృచ్ఛికంగా వారిలో నలుగురు రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆయన ప్రారంభించిన మంచి పనిని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. జిల్లా గవర్నర్ మరియు క్లబ్ సభ్యుల సమక్షంలో ఆయనకు అందజేసిన చెక్కును స్వీకరించడానికి ప్రేమ సమాజం తరపున ఆఫీస్ మేనేజర్ శ్రీ ప్రదీప్ హాజరయ్యారు. నేటి సమావేశానికి స్పీకర్ గా గత జిల్లా కార్యదర్శి రోటేరియన్ పి. ఎన్. వి విద్యా సాగర్ వారి ప్రస్తుత పోర్ట్‌ఫోలియోలో భాగంగా డైరెక్టర్ల బోర్డు వారి విధులు మరియు బాధ్యతలపై రిఫ్రెషర్ సెషన్ నిర్వహించడానికి ఈ అవకాశాన్ని పొందారు. ఈ సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు శ్రీ డి సత్యనారాయరెడ్డి అధ్యక్షత వహించారు. రోటేరియన్ మాధవి కృతజ్ఞతలు తెలిపారు.



# విజయభాను సంపాదకీయం

## సాహితీ సిరి సినారె

నిరంతర కవి, విశ్వంభర నాథుడు, మనవతా మహనీయుడు, ఆధునిక మహాకవి, వక్త, సాహితీ పరిశోధకుడు, బహుభాషావేత్త, ప్రయోగ శీలి, ప్రసిద్ధ సినీ గేయ రచయిత ఇలా ఎన్ని పేర్లుగా పిలిచినా ఆయనే, మన సాహితీ దిగ్గజం సినారె.

డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి గారు అందరికి 'సినారె'గా సుపరిచితులు. సినారె గారి మొదటి పేరు సత్యనారాయణ రెడ్డి. ప్రాచుర్యంలో సింగిరెడ్డి నారాయణ రెడ్డిగా, సినారెగా ప్రసిద్ధికెక్కారు. ఆయన భార్య మరణానంతరం భార్య పేరు మీద సుశీల నారాయణ రెడ్డి సాహిత్య పురస్కారాన్ని ప్రారంభించిన సాహితీ సమదర్శి సినారె.

సినారె ఉస్మానియాలో ఉర్దు మీడియంలో బీఏ పూర్తి చేశారు.1954లో ఉస్మానియాలో ఎం.ఏ తెలుగు పూర్తిచేసి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో 'ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు-ప్రయోగములు' అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. సినారె గారికి చిన్నప్పటి నుండి కవిత్వం పట్ల ఆసక్తి ఎక్కువ. ఆరేడు తరగతుల వయసులోనే కవితలు రాశారు. అనేక జానపదాలు, హరికథలు, బుర్రకథలు వినిపించారు. సినారె తొలి రచన 1953లో 'నవ్వనిపువ్వు' ను రాశారు. అనేక గేయనాటికలను, గేయకవితలను, ఖండ కావ్యాలను, కవితాసంపుటాలను, విశిష్ట కావ్యాలను, వ్యాససంపుటాలను, దీర్ఘ కావ్యాలను రాసిన సాహితీ ఉప్పెన సినారె.

సినారె గారి 'విశ్వంభర' వచన కావ్యానికి 1988లో జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. 'మంటలూ -మానవుడు' అనే కవితాసంపుటానికి 1973లో 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. బౌద్ధ కథగా 'నాగార్జునాసాగరం' పేరు పొందిన కథాకావ్యం. మాత్రాఛందస్సుకు ప్రాణం పోసిన గేయకావ్యం 'కర్పూ ర వసంతరాయలు' ఎనలేని ఖ్యాతిని పొందిం ది.'మధ్యతరగతి మందహాసం' కవితాసంపుటి వచనకవిత్వాన్ని బలోపేతం చేసింది. 'ప్రపంచ పదులు' వంటి విశిష్ట కావ్యాలను రాశారు.

'ప్రపంచ పదులు'లో..'చేతగాని తనముంటే జాతకాన్ని నిందించకునమ్మలేని సరుకుంటే అమ్మకాన్ని నిందించకు కలం రాయలేకుంటే కాగితాన్ని నిందించకు..' అంటూ చెప్పిన కవిత్వం అద్వితీయం.అలాగే గజల్ లో..'మబ్బుకు మనసే కరిగితే అది నీరవుతుందిమనసుకు మబ్బె ముసిరితే కన్నీరవుతుంది..'అని చెప్పిన కవితలు నేటికీ ఆదర్శవంతగా ఉన్నాయి. ఊపిరి ఉన్నంత వరకు ఆయన కవితావాహిని ఆగలేదు. కలం, గళం రెండు ఆయన అస్త్రాలు.

సినారె గారు1981లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, 1985లో అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా, 1989లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా, 1992లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల సలహాదారులుగా, 1993లో ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా- ఏ పదవిలో ఉన్నా ఆ పదవులకు వన్నె తెచ్చారు. 1962నుంచి సినీ ప్రస్థానం ప్రారంభించి సినీ గేయాలు రాయడం మొదలు పెట్టారు. 'గులేబకావళి కథ' సినిమాలో 'నన్ను దోచుకుందువటే... వన్నెల దొరసాని..' అనే పాటతో పాటు ఆ సినిమాకు అన్ని పాటలు రాశారు. 'అరుంధతి', 'మేస్త్రీ' సినిమాల వరకు మొత్తం మూడువేల వరకు పాటలు రచించి సాహిత్య వాణిగా మిగిలి పోయారు.

'గున్నమామిడీ కొమ్మమీద...గూళ్ళు రెండున్నాయి..'
'పగలే వెన్నెలా... జగమే ఊయలా..'
'వస్తాడు నా రాజు ఈ రోజు..'
'అమ్మను మించి దైవం ఉన్నదా..'
'కంటేనే అమ్మ అని అంటే ఎలా..'
'జేజెమ్మా..... మాయమ్మ..' అంటూ అద్భుత పాటలు సినారె కలం నుండి
జాలువారిన సాహిత్య చంద్రికలు.

జ్ఞానపీఠ్ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులతో పాటు సినారె ఎన్నో పురస్కారాలను పొందారు. 1977లో పద్మశ్రీ, 1992 లో పద్మభూషణ్ అందుకున్నారు. రాజ్యలక్ష్మీ పురస్కారం, సోవియెట్ నెహ్రూ పురస్కారం, కళాప్రపూర్ణ, సినీకవిగా నంది పురస్కారం, పలు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్‌లను అందుకున్నారు. 2014లో జీవన సాఫల్య పురస్కారం పొందారు.

సినారె గురించి కుందుర్తి గారు 'తిలక్ లాగా రెండంచుల పదును గల కత్తి సినారె..' అని చెప్పారు. తాపి ధర్మారావు 'సినారె' గారిని మహాకవిగా ప్రశంసించారు. ఆయన తన సొంత ఊరిలో తన ఇంటిని గ్రంథాలయానికి ఇవ్వడం, పాఠశాల భవనం నిర్మించడం, కళా మందిరాన్ని, కళ్యాణ మండపాన్ని కట్టించడం వంటి సేవా గుణాన్ని కలిగిన సామాజిక సేవకుడు సినారె.

# హెచ్ఆర్‌డీ ఇక కేంద్ర విద్యాశాఖ!



న్యూఢిల్లీ: కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (హెచ్ఆర్‌డీ) పేరును విద్యాశాఖగా మారుస్తూ బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో జరుగుతున్న కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. అదేవిధంగా నూతన జాతీయ విద్యా విధానానికి కూడా కేబినెట్ ఆమోద ముద్రఏ ేసింది. వీటికి సంబంధించి పూర్తివివరాలు మంత్రిమండలి సమావేశం ముగిసిన తర్వాత వెల్లడికానున్నాయి. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖకు ప్రస్తుతం రమేశ్ పోఖ్రియాల్ నిశాంఖ్ మంత్రిగా బాధ్యలు నిర్వర్తిస్తున్నారు. దేశీయ విద్యా విధానంలో భారీగా మార్పులు తీసుకురావాల్సి ఉన్నదని ప్రధాని మోదీ గత మే నెలలో ప్రకటించారు. విద్యారంగంలో సాంకేతికత పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. హెచ్ఆర్‌డీ వివరాల ప్రకారం జాతీయ విద్యావిధానానికి (ఎన్ఈపీ) చివరిసారిగా 1992లో సవరణలు చేశారు. 1986లో మొదటిసారిగా ఎన్ఈపీని రూపొందించారు. మూడు దశాబ్దాల తర్వాత ఎన్ఈపీకి మళ్లీ ఇప్పుడు సవరణలు తీసుకువస్తున్నారు.

# రాఫెల్ పక్షుల గృహప్రవేశం.. మురిసిన భారత గగనతలం



హైదరాబాద్: రాఫెల్ యుద్ధ విమానాలు గృహప్రవేశం చేశాయి. ఏడు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన రాఫెల్ విమానాలు.. ఇవాళ అంబాలా ఎయిర్‌బేస్‌లో సురక్షితంగా ల్యాండ్ అయ్యాయి. ఆ విమానాల రాక భారత అస్త్రశక్తిని మరింత పెంచింది. భారత గగనతలంలో ప్రవేశిస్తున్న వేళ రాఫెల్ గర్జనలు మారుమోగాయి. ఫ్రాన్స్ నుంచి బయలుదేరిన అయిదు రాఫెళ్లు.. భారత గగనతలంలోకి ఇవాళ మధ్యాహ్నం ప్రవేశించాయి. ఆ సమయంలో అద్భుతమైన ఘట్టం చోటుచేసుకున్నది. అయిదు రాఫెళ్లకు రెండు సుఖోయ్‌లు అండగా నిలుస్తూ స్వాగతం పలికాయి. ఆ దృశ్యం నీలాకాశంలో కనువిందు చేసింది. భారత గగనతలంలోకి ప్రవేశిస్తున్న రాఫెల్ యుద్ధ విమానాల ఫోటోలను రక్షణమంత్రి కార్యాలయం తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. రాఫెల్ పక్షులు ఇండియన్ ఎయిర్‌స్పేస్‌లోకి ఎంటర్ అయినట్లు ట్వీట్‌లో తెలిపారు.

### ఆరు ట్రైనీ రాఫెళ్లు..

ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ కంపెనీ తయారు చేసే ఈ యుద్ధ విమానాలను భారత్ కొనుగోలుచేసింది. మొత్తం 36 రాఫెళ్లకు ఒప్పందం కుదిరింది. అయితే తొలుత అయిదు రాఫెల్ విమానాలను అప్పగించారు. దీంట్లో 30 రాఫెల్ విమానాలు ఫైటర్ జెట్స్ కాగా, మరో ఆరు ట్రైనీ విమానాలు ఉండనున్నాయి. 60 వేల కోట్లతో రాఫెల్ డీల్ కుదుర్చుకున్నారు. 400 కోట్లతో రాఫెల్ విమానాల మౌళిక సదుపాయాల కోసం ఖర్చు చేశారు. 17వ గోల్డెన్ యారో స్క్వాడ్రన్‌లో ఈ విమానాలు ఉంటాయి. శౌర్యచక్ర విజేత కెప్టెన్ హరికీరత్ సింగ్ తొలి రాఫెల్‌ను ల్యాండ్ చేస్తారు. 2008లో మిగ్ విమానాన్ని అత్యంత చాకచక్యంగా ల్యాండ్ చేయడంలో కెప్టెన్ హరికీరత్ కీలక పాత్ర పోషించాడు. మిగ్‌లో పేలుడు జరిగినా.. కాక్‌పిట్ నుంచి చీకట్లోనే యుద్ధ విమానాన్ని ల్యాండ్ చేశాడతను.

### మెటిరో, స్కాల్ప్ మిస్సైళ్లు..

రాఫెల్ యుద్ధ విమానాలు మిస్సైళ్లను కూడా మోసుకెళ్తాయి. మెటిరో, స్కాల్ప్ లాంటి క్షిపణలను అవి ప్రయోగించగలవు. కంటికి కనిపించని దూరంలో ఉన్న టార్గెట్‌ను అవి చేధించగలవు. మెటిరో మిస్సైళ్ల రేంజ్ 150 కిలోమీటర్లు ఉంటుంది. స్కాల్ప్ మిస్సైల్ 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్‌ను ధ్వంసం చేస్తుంది. రాఫెల్ యుద్ధ విమానాల్లో టూ సీటర్, సింగిల్ సీటర్లు ఉన్నాయి. టూ సీటర్‌ను రాఫెల్ డీహెచ్, సింగిల్ సీటర్‌ను రాఫెల్ ఈహెచ్ అని పిలుస్తారు. రెండూ ట్విన్ ఇంజిన్ విమానాలే. ఇవి ఫోర్త్ జనరేషన్ ఫైటర్ విమానాలు. డెల్టా వింగ్, స్టీల్త్ సామర్థ్యం వీటికి ఉన్నది. అణ్వాయుధ దాడిలోనూ ఈ యుద్ధ విమానాలను వినియోగించే అవకాశం ఉన్నది.

### సింథటిక్ అపచ్యూర్ రేడార్

రాఫెల్ విమానాల్లో సార్ రేడార్లు ఉంటాయి. సింథటిక్ అపచ్యూర్ రేడార్ సాధారణంగా జామ్ కాదు. లాంగ్ రేంజ్ టార్గెట్లను ఈ రేడార్ గుర్తిస్తుంది. రేడార్ జామ్ కాకుండే ఉండే సదుపాయాలు కూడా దీంట్లో ఉన్నాయి. రాఫెల్‌లో ఉన్న రేడార్... కనీసం 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రు టార్గెట్‌ను గుర్తించగలదు. ఈ యుద్ధవిమానాల్లో ఆధునిక 30ఎంఎం కెనాన్ ఆయుధాలు ఉంటాయి. అవి 125 రౌండ్ల కాల్పులు జరపగలవు. ఈ విమానాలు ఒకేసారి పది టన్నుల సరకులను మోసుకెళ్లగలవు. రాఫెల్ విమానాలు హమ్మర్ అనే మీడియం రేంజ్ మిస్సైళ్లను కూడా ప్రయోగిస్తాయి. ఆకాశం నుంచి నేలపై ఉన్న టార్గెట్‌ను స్ట్రయిక్ చేస్తాయి. లడఖ్ లాంటి పర్వత ప్రాంతాల్లో ఉన్న బలమైన కట్టడాలను, బంకర్లను కూడా హమ్మర్ మిస్సైల్ ధ్వంసం చేయగలదు.

# కారు దగ్ధం.. ఎస్‌బీఐ ఉద్యోగి సజీవదహనం

నంద్యాల : కారులో మంటలు చెలరేగి ఎస్‌బీఐ ఉద్యోగి సజీవదహమయ్యారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున కర్నూలు జిల్లా నంద్యాల మండలం చాపిరేవుల టోల్‌ప్లాజా సమీపంలో జరిగింది. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌బీఐ ఉద్యోగి శివకుమార్ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి హైదరాబాద్‌కు నుంచి నంద్యాలకు కారులో బయలుదేరారు.

కర్నూలు జిల్లాలోని నంద్యాల సమీపంలో ముందుగా వెళ్తున్న కంటైనర్‌ను వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో కారు కంటైనర్‌లో ఇరుక్కుపోయింది. ప్రమాదాన్ని కంటైనర్ డ్రైవర్ గమనించకపోవడంతో కారును సుమారు 3కిలోమీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ఈ క్రమంలో నంద్యాల మండలం చాపిరేవుల టోల్‌ప్లాజా వద్ద కారులో మంటలు చెలరేగాయి.

శివకుమార్(40) దివ్యాంగుడు కావడంతో కారులో నుంచి బయటకు రాలేక సజీవదహమయ్యాడు. మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఈ మేరకు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు శివకుమార్ స్వస్థలం కర్నూలు జిల్లా నంద్యాల మండలం రైతునగరం, కాగా నంద్యాల ఎస్‌బీఐ బ్యాంకులో పనిచేస్తున్నాడు.

## కవి సమయం

### జీవితం

వర్తమానంలో జీవిస్తూ
భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ
ఆశావహ దృక్పథంతో సాగడం ఆవశ్యం
ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు
ప్రణాళికలు, కార్యాచరణ, పట్టుదల,
క్రమశిక్షణ, ముందుచూపు అత్యావశ్యకం
మనోభావాలలో చైతన్యం
ఆలోచనలలో నూతనత్వం
ప్రవర్తనలో దివ్యత్వం
సంబంధిత రీతిలో ఆదర్శవంతమైన
నూతన నిర్ణయాల రూపకల్పన
భిన్నత్వంలో ఏకత్వం
జాతీయ సమగ్రత, సర్వజీవ సమానత్వం
ఉల్లాస, ఆనందభరితమైన జీవితం
అందరి లక్ష్యం, గమ్యం, ఆశయం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : ఏకాదశి రా.12.39; అనూరాధ ఉ.9.36; ప.వ.2.56ల 4.28.

గురువారం 30-07-2020

**మేషం** : విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్తం ధనం బాగా ఖర్చు చేస్తారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసు కోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది. **వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు. **మిథునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిర చరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పు దారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదు రవుతుంది. **కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవ హారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి. **కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టు కుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభ మవు తాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది. **తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పుదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది. **వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది. **ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకు తనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. **మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవు తారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. **కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. **మీనం** :దైవ పుణ్య కార్య క్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి.

# ధనలక్ష్మీ కొలువుండాలంటే ఇలా చేయాలట!!

మార్కెట్లో కూరగాయలకు, షాపింగ్‌లకు వెళ్లి ఏమైనా కొనుగోలు చేసిన తర్వాత మిగితా చిల్లరను జేబులో వేసుకుని ఇంటికి చేరు కుంటారు. రాగానే సామాన్లను హాల్లో పడేసి జేబు లోని చిల్లర తీసి ఎక్కడో ఓ చోట పడేస్తుంటారు. ఇక ఆడవాళ్ల గురించి చెప్పాల్సి వస్తే వీటిని తీసుకుళ్లి నేరుగా పోపు డబ్బాల్లో దాచేస్తారు.
అదీ కాదంటే కూరగాయలు భద్రపరిచే బాస్కెట్ అడుగు భాగంలో పడేస్తారు.
ఎప్పుడైనా డబ్బులు అవసరమైతే పోపు డబ్బాలు, కూరగాయల బాస్కెట్లలో కెలికి వాటిని వాడుకుంటారు.
అయితే ఇలాంటి నిర్వాకాలు అసలు చేయకూడదట. ఎందుకంటే డబ్బులను ఎక్కడ పడితే అక్కడ పడిస్తే లక్ష్మీదేవికి ఆగ్రహం వస్తుందట. ఓ పద్ధతంటూ లేకుండా డబ్బులను ఎక్కడక్కడ వదిలేస్తే లక్ష్మీ ఇంట్లోంచి మెల్లగా జారుకుంటుందట. కాబట్టి ప్రత్యేకించి కొన్ని దిక్కుల్లో మాత్రమే నగదు భద్రం చేసుకోవాలట.
అప్పుడే ధనలక్ష్మి ఇంట్లో కొలువుం టుందట. తూర్పు దిక్కులో డబ్బు, లాకర్లు, పశ్చిమ వైపు నగలు పెట్టుకోవాలట. ఉత్తర దిశలో నగలు, డబ్బు కలిపి పెట్టుకోవాలట. నగదును ఎప్పుడూ దక్షిణం వైపు పెట్టకూడదట. అలాగే బాత్రూమ్ ఎదురుగాను డబ్బు భద్రపరిచే లాకర్లు పెట్టరాదట.
అంతే కాకుండా లాకర్‌లో దుమ్ము ధూళిని శుభ్రం చేసుకోవాలట.
బీరువాల్లో కొందరు లక్ష్మీదేవి ప్రతిమలు, బొమ్మలు ఉంచుతారు.
అలాంటి వాళ్లు మాత్రం లక్ష్మీ పక్కన రెండు ఏనుగులు ఉండే రూపాలను మాత్రమే పెట్టుకోవాలి. ఇంట్లో లక్ష్మీదేవి వెండి విగ్రహాలను, శ్రీ యంత్రాలను ఉంచుకుంటే సంపదకు కొలువే ఉండదట.
లివింగ్ రూమ్‌లో వాటర్ ఫౌంటెయిన్‌ను ఆగ్నేయ దిశలో పెట్టుకోవాలట.
దాని పక్కనే ఆక్వేరియాన్ని ఏర్పాటు చేసుకుని డ్రాగన్ ఫిష్ పెంచుకుంటే సిరిసంపదలు వెల్లు విరుస్తాయట.



**కావలెను**
ఇంట్లోనే ఉంటూ మా కంపెనీ యొక్క SMS/Mails forward చేయుటకు **యువతీ, యువకులు** కావలెను.
అర్హత : 10th to Degree
**91330 97781**

# పరిశుభ్రతా పక్షోత్సవాలు



పెద్దాపురం : పరిశుభ్రతా పక్షోత్సవములలో భాగముగా పెద్దాపురం మండలం నందు మనం-మన పరిశుభ్రత పైలట్ ప్రాజెక్టు కార్యక్రమమునకు ఎంపిక చేయబడిన చదలాడ మరియు ఉలి మేశ్వరం గ్రామ పంచాయితీల యందు 3వ రోజు కార్యక్రమములో భాగముగా గ్రామపంచాయితీల యందు ఎంపిక చేయబడిన టాస్క్‌ఫోర్సు టీముల ద్వారా ట్రాన్సాక్ట్ వాక్ నిర్వహించుట జరిగినది. సదరు కార్యక్రమము నందు ప్రత్యేక అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, విస్తరణాధికారి పెద్దాపురం, గ్రామస్ధాయి కమీటి మెంబర్లు, వారు వార్లు హాజరైనారు. రేపటి నుంచి గ్రామాలలో ప్రతి రోజు 50 కుటుంబాలను సంద ర్శించి, పారిశుద్ధ్య నిర్వహణపై తగు అభిప్రాయాలు, సమస్యల పరిష్కారమునకు చర్యలు తీసు కొనుదురు.

## వచ్చే నెల 3న సంస్కృత భాషా దినోత్సవం

పెద్దాపురం : 03-08- 2020 తేదీ సోమవారం శ్రావణ పౌర్ణమి. ఆరోజు సంస్కృత భాషాదినోత్సవం కూడా జరుపుకుంటారు. ఈ సంస్కృత భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సంస్కృత శ్లోకాల పోటీ నిర్వహించబడుతుంది. దీనికి ఐదు శ్లోకాలు, తాత్పర్యంతో సహా మేము అందజేస్తాము. వాటిని విద్యార్థు లందరూ నేర్చుకొని చూడకుండా చెప్పవలసి ఉంటుంది. ఈ పోటీలో పాల్గొనే విద్యార్థుల వివరాలు పేరు, తరగతి,ఊరు, ఫోన్ నెంబరు (వాట్సాప్ కలది) 9133586708 వాట్సాప్ నెంబర్ కి ఒకటవ తేదీ, ఆగష్టు నాటికి పంపించవలెను.ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న విద్యార్థులందరు పాల్గొనవచ్చు. ఈ పోటీలు ఆన్ లైన్ ద్వారా 4-8 -2020 న నిర్వహించబడును. వివరములకు 9396224463 నంబర్కు ఫోను చేయగలరు మిత్రులు,ఉపాధ్యాయులు,తల్లి దండ్రులు మీపిల్లలను,విద్యార్థులు ను ప్రోత్సహించి సంస్కృత భాషా దినోత్సవం ను విజయవంతం గావించవలసినదిగా కోరతూ....

డి.వి.శర్మ పెద్దాపురం.

## చందనం అలంకరణలో స్వయంభు విఘ్నేశ్వరుని దర్శనం



చందనం పూత అలంకరణలో చోడవరం స్వయంభు విఘ్నేశ్వర స్వామి

చోడవరం : పట్టణంలోని భాగంగా విరాజిల్లుతున్న చోడవరం స్వయంభు విగ్నేశ్వర స్వామి వారు చందనం పూతతో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం శ్రావణమాసం దశమి సందర్భంగా కార్య సిద్ధి విఘ్నేశ్వర స్వామి వారిని చందనంతో అలంకరించి విశేష పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు.

# సాహితీ పుత్రుడు డా.సినారె జయంతి



విశాఖపట్నం : తెలుగు చలన చిత్ర రంగంలో డా.సినారె గా పేరొందిన సింగిరెడ్డి నారాయణ రెడ్డి పుట్టిన రోజు నేడు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఆయన రాసిన విశ్వంభర కావ్యానికి ప్రతిష్టాత్మకమైన జ్ఞాన పీఠ పురస్కారాన్ని 1988 లో కేంద్ర ప్రభుత్వం ప్రధానం చేసింది. 1962లో గులేభ కావళి కథ చిత్రం ద్వారా గీత రచయితగా పరిచయమైన నారాయణ రెడ్డి నన్ను దోచుకుందువటే, చిరునవ్వులోని హాయి, తెలుగు జాతి మనది, సరి సరి వగలు తెలిసిన, ఏమో ఏమో ఇది, తోటలో నారాజు, ఆ నవ్వుల కోసమే, అమ్మా అమ్మా అని పిలిచావు, అనుబంధం ఆత్మీయత వంటి ప్రజాదరణ పొందిన గీతాలు రాసి అన్నివర్గాల ప్రజల మదిలో నిలిచారు. ఆయన రాసిన తెలుగు, హిందీ, ఉర్దూ గజల్స్ ఎంతో ఖ్యాతి పొందాయి ఎన్నో గజల్స్ తనే స్వయంగా పాడి అందర్నీ అలరించారు. 2017 జూన్ 12న కన్ను మూశారు. వారిని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సుప్రీం కోర్టు న్యాయమూర్తి చలమేశ్వర్, డా.యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఎంవీవీఎస్ మూర్తి వంటి ప్రముఖులతో కలిసి సత్కరించే అవకాశం కలగడం నా పూర్వ జన్మ సుకృతం.

## పరవాడలో కిరణా వ్యాపారి సతీమణికి కరోనా

### పరవాడ గ్రామ ప్రజలు తస్మాత్ జాగ్రత్త



పరవాడ : మండల కేంద్రమైన పరవాడలో గల కిరణా వ్యాపారి సతీమణి ఒక్కరికి కరోనా పాజిటివ్ కేసు నమోదుఅయ్యింది అని అధికారులు తెలిపారు. దీంతో పరవాడలో గల ప్రజలు అందరూ తస్మాత్ జాగ్రత్తగా ఉండాలి అని అత్యవసరసమయంలో తప్ప బయటికి రాకూడూదు అని తెలిపారు. ప్రతి ఒక్కరూ మాస్క్ తప్పనిసరిగా ఉపయోగించాలి అని తెలిపారు.

## దేవరాపల్లిలో విఎల్ఎం వైద్య పరీక్షలు



దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో బుధవారం 10 మందికి వి ఎల్ ఎం కరోనా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పిహెచ్ సి వైద్యాధికారి ఎస్. లలితా తెలిపారు. మండలంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా ఈ పరీక్షలు జరిపామన్నారు. వీటిని కె. కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రికి పంపామన్నారు. ఫలితాలు రెండు, మూడు రోజుల్లో వస్తాయని ఆమె తెలిపారు.

## జగనన్న పచ్చతోరణం లో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ



మొక్కలను పంపిణీ చేస్తున్న ఫారెస్ట్, సచివాలయ అధికారులు, స్థానిక నాయకులు

చోడవరం : జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గజపతినగరం గ్రామంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. చోడవరం ఫారెస్ట్ రేంజర్ రామ్ నరేష్ బిర్లంగి ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కే యశ్వంతు, మాజీ సర్పంచ్ మల్ల శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చోడవరం డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ రాజగోపాల్ పాల్గొని గ్రామ సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖా పరంగా చోడవరం రేంజ్ పరిధిలో లక్ష మొక్కలు నాటేం దుకు లక్ష్యం ఏర్పరు చుకోవడం జరిగిందని, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్డుకు ఇరువైపులా, అలాగే గ్రామంలో ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ శ్రీనివాస రావు చేతులమీదుగా మొక్కలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గణేష్ డిఫెన్స్ అకాడమీ గణేష్, స్థానిక యువత ఆడారి కోటి ఆది నాయుడు, కనిశెట్టి దుర్గా సంతోష్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరంలో విజృంభిస్తున్న కరోనా

### - 29 కి చేరుకున్న కరోనా కేసులు




అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరంలో కోవిడ్-19 కేసులు రోజురోజుకు విజృంభిస్తున్నందున ప్రజలు భయాందోళన చెందుతున్నారు.గ్రామంలో ఒక్క సారిగా 10 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.కోవిడ్-19 కేసులు వివరాలు తెలిసిన వెంటనే పంచాయతీ అధికారులు కేసులు నమోదు అయిన చోట బ్లీచింగ్ చల్లి శానిటైజేషన్ చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడుగా సోము వీర్రాజు నియామకం హర్షం



అన్నవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడుగా సోము.వీర్రాజు నియామకం పట్ల బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ కార్యదర్శి చోడ్రాజు.సత్య కృష్ణంరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామర్సు చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోము.వీర్రాజు దశాబ్దాలుగా పార్టీకోసం చేసిన సేవలకు, కృషి కి దక్కిన గౌరవమని వారి నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు అందరం కృషి చేస్తామని బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి శ్రీ చోడ్రాజు సత్య కృష్ణంరాజు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామర్సు చిరంజీవి అన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపడుతున్న సోమువీర్రాజు కి హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు.

## మత్స్యకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నిరసన



భీమునిపట్నం: జీవీఎంసీ భీమిలి జోన్ నాలుగవ వార్డ్ చేపలఉప్పాడలో "భారతీయ మజ్దూర్ సంఘ్" (బిఎంఎస్) అనుబంధ సంస్థలు భవన నిర్మాణ కార్మిక సంస్థ, మత్స్య కార్మిక సంఘ సంయుక్తంగా కార్మికుల సమస్యలపై సర్కార్ జగావ్ సప్తా లో భాగంగా బుదవారం నిరసన కార్యక్రమం చేపట్టారు స్థానిక బీఎంఎస్ మండల అధ్యక్షుడు కురందాస్ మల్లయ్య మాట్లాడుతూ మత్స్యకారులకు హక్కులు కల్పించాలని .తీర ప్రాంతం అంతా మినీ జట్టీ లు ఏర్పాటు చేయాలని మత్స్యకారులకు వడ్డీలేని రుణాలు వ్యాపార నిమిత్తం ఇవ్వాలని, అలాగే బయో మెట్రిక్ కార్డులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని కార్మిక వ్యతిరేక ఆర్డినెన్సులను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేసి కోల్డ్ స్టోరేజ్ లు కట్టించాలని, అలాగే భవన నిర్మాణ కార్మికుల నమోదును ఆ న్ని కార్మిక సంఘాలకు ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ను అన్ని కార్మిక సంఘాలతో సంక్షేమ ను ఏర్పాటు చేయాలని.సాంఘిక బద్రత కల్పించాలని, (ఇ ఎస్ ఐ, పి ఎఫ్)ఇళ్ళ స్థలాలు, కాలనీలు ఏర్పాటు చేయాలని. కార్మిక వ్యతిరేక ఆర్డినెన్సు లను రద్దు చేయలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం బారులు తీరి నిరసన వ్యక్తం ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమ్మడి మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మికుల సమస్యలపై మాట్లాడాతూ . బిజెపి నాయకులు వాసుపల్లి శ్రీహరి, బత్తిన రమణ, రాగతి అప్పన్న సంఘీభావం తెలిపారు.బి ఎం ఎస్ అసంగటిత కార్మికుల రాష్ట్ర కార్యదర్శి వాసుపల్లి దానయ్య, మత్స్య కార సంక్షేమ సమితి జిల్లా కార్యదర్శి దాసరి గోపి, మత్స్య కార్మిక సంఘం నాయుకులు సూరాడ చిట్టిబాబు, రాగతి దనరాజు, మహిళా మత్స్య కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ బాసుమతి పంట ప్రయోగం విజయవంతం

కాకినాడ : చింతపల్లి పరిశోధన స్టేషన్ పరిధిలో ఈ ఏడాది చేపట్టిన ఆర్గానిక్ బాసుమతి వరి పంట ప్రయోగం విజయవంతమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. సుగంధిమతి రకం బాసుమతి పంటతో నాణ్యత కలిగిన దిగుబడి వచ్చిందన్నారు. కాకినాడలో చింతపల్లి రీసెర్చి స్టేషన్ ఏడీఆర్ జి.రామారావు ఆర్గానిక్ బాసుమతి పంట ప్రయోగాలను మంత్రికి వివరించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో గిరిజనులకు మేలుకలిగేలా విశాఖ ఏజెన్సీలో పెద్దఎత్తున బాసుమతి పంట పండించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వచ్చే రబీ సీజన్‌లో గిరిజనులకు బాసుమతి వరి విత్తనాల మినీ కిట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. ఇక్కడి బాసుమతి మంచి సువాసన కూడా కలిగి ఉందని, వీటిని మరపట్టడానికి ప్రత్యేక రైస్ మిల్లు అవసరమవుతుందని అధికారులు చెబుతున్నారన్నారు.

## నాడు నేడు పనుల పరిశీలించిన ఎంఇఒ



గొలుగొండ : గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను బుధవారం ఎంఇఒ టి.అమృత కుమార్ సందర్శించారు. పాఠశాల ఉపాధ్యాయులు నాగు, పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులను పనుల తీరుపై అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

## మైలాన్ క్షయ ఔషధానికి డీసీజీఐ అనుమతి

విశాఖపట్నం : క్షయ వ్యాధి చికిత్సలో ఉపయోగించే ప్రిటోమనిడ్ ఔషధానికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి అనుమతి లభించిందని ఫార్మా సంస్థ మైలాన్ ఈ మేరకే ఒక ప్రకటన విడుదల చేసింది. సాధారణ మందులకు లొంగని క్షయ వ్యాధి గ్రస్తులకు ఈ ఔషధాన్ని వాడతారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమం కింద షరతులతో కూడిన వినియోగానికి ప్రిటోమనిడ్కు డీసీజీఐ అనుమతి ఇచ్చిందని తెలిపింది. ప్రపంచంలో ఈ ఉత్పత్తికి నియంత్రణ ఆమోదాన్ని అందిస్తుంది. షరతులతో కూడిన యాక్సెస్ ఆమోదం ద్వారా మైలాన్ ప్రారంభంలో భారతదేశంలో 400 ట్రీట్మెంట్ కోర్సులను విరాళం ద్వారా ప్రభుత్వ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమానికి అందుబాటులోకి తెస్తోంది. ఇది దేశవ్యాప్తంగా ఉచిత, అధిక నాణ్యత గల క్షయ నిరోధక మందులు సంరక్షణను అందిస్తోంది. చికిత్స అవసరమైన రోగులకు అందుబాటులో ఉందని నిర్ధారించడానికి. మైలాన్ ప్రెసిడెంట్ రాజీవ్ మాలిక్ మాట్లాడుతూ రోగుల కోసం కొత్త ఔషధాల లభ్యతను విస్తరించడంలో టీబీ అలయన్స్‌తో మేము గర్విస్తున్నట్లు తెలిపారు.

## వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రజలకు సేవ చేయాలి : మంత్రి మల్లాడి

యానాం : పుదుచ్చేరి ఆరోగ్య మంత్రి మల్లాడి ఆశయాలకు అనుగుణంగా మత్స్యకారుల సంక్షేమానికి అన్ని విధాల కృషి చేస్తానని ఆంధ్ర ప్రదేశ్ మత్స, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పేర్కొన్నారు. బుధవారం పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావును యానాంలోని ఆయన సగృహంలో మర్యాదపూర్వకంగా మంత్రి అప్పలరాజు కలిసారు.ఈ సందర్భంగా మంత్రులిద్దరూ ఒకరినొకరు శాలువాలతో సత్కరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎప్పుడు తాను విధేయుడిగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. మంత్రి మల్లాడి కృష్ణారావు సూచించిన విషయాలు, ఇచ్చిన సందేశం పాఠం తో సమానం అని అభివర్ణించారు. మర్యాదపూర్వకంగా కలిశాననే కంటే ఆయన ఆశీస్సులు పొందడం కొరకు వచ్చానన్నారు.మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రజలకు గుర్తుండిపోయే సేవలు అందించి కులమును మర్చిపోకూడదని కులాన్ని బట్టి ఈ స్థానంలో ఉన్నామని మర్చిపోకూడదని మనకు సాయి పడిన వారిని ఎన్నడు మర్చిపోకూడదని అదేవిధంగా వైఎస్సార్ కుటుంబాన్ని ఏ స్థితిలో ఉన్న మీరు మర్చిపోకూడదు అన్నారు . అలాగే ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ఎన్నడూ లేని విధంగా నియోజవర్గానికి 400 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని దీనికి కారణం ఒక మీటింగ్లో మత్స్యకారుల పొలానికి సంబంధించి వారి జీవన విధానం గురించి మాట్లాడటంతో స్పందించిన ముఖ్య మంత్రి వెంటనే 400 కోట్లు నియోజకవర్గానికి కేటాయించారన్నారు గురువు మల్లాడి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవడం వలన ఆయన మార్గంలో నడిస్తే ఇలాంటివి ఎన్నో సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, ముమ్మిడివరం నియోజక వర్గ మత్స్యకార సంఘం నాయకులు, కాకినాడ, యానాం మత్స్య కార సంఘం నాయకులు మంత్రి అప్పలరాజు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మహర్దశ



ఇచ్ఛాపురం : ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కళాశాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు పరిపాలనా మోదం తెలియజేస్తూ, రాష్ట్ర ఉచ్ఛాతర్ శిక్షా అభియాన్(రుస)పథకం సంచాలకులు ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం, పాలకొండ డిగ్రీ కళాశాలలకు ఈనిధులు మంజూరయ్యాయి. మొత్తం రూ.2 కోట్లు గతంలోనే మంజూరుకాగా, సివిల్ పనులకు రూ.1.40 కోట్లు చొప్పున పరిపాలనామోదం లభించింది. మిగిలిన రూ.60 లక్షలతో కళాశాల ఉపకరణాలు, సౌర విద్యుత్తు సౌకర్యాల మెరుగుకు వినియోగిస్తారు. తాజాగా వచ్చిన నిధులు రూ.1.40కోట్లలో కొత్తగా అదనపు భవనాల నిర్మాణం, పాత భవనాల అభివృద్ధి, ఇతర సివిల్ పనులు చేయనున్నట్లు ఇచ్ఛాపురం కళాశాల ప్రిన్సిపల్ డా.నిత్యానంద పట్నాయక్ తెలిపారు. 1983లో ఆవిర్భవించిన ఈ కళాశాల దశాబ్దన్నరకు పైగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోనే సర్దుబాటు విధానంలో నిర్వహించారు. ప్రస్తుతం రత్తకన్న సమీపంలో 14 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల ఉంది. భవనాల కొరత, ఆవరణ గుంతలమయం కావడం, తాగునీటిఇబ్బంది, మరుగుదొడ్లు లేకపోవడం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. డా.బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ పరిధిలో ఉత్తమ బోధనలతో, క్రమశిక్షణకు మారుపేరుగా గుర్తింపుపొందిన ఈ కళాశాలకు రుస నిధులు రావడంతో అభివృద్ధి పనులు జరిగి, మంచిరోజులు వచ్చినట్లేనని అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

## 1600 లీటర్ల పులసిన బెల్లపు ఊట ధ్వంసం

### 2 కేసులు నమోదు



పెద్దాపురం : పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో పెద్దాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టీమ్ లు రంగంపేట మండల పరి ధిలో దాడులు నిర్వహించి మర్రిపూడి గ్రామ పరిధి లో 2 వేర్వేరు ప్రదేశాల్లో సారాయి కాపునకు నిల్వ ఉంచిన 1600 లీటర్ల పులసిన బెల్లపు ఊటను కనుగొని ధ్వంసం చేసి (2)కేసులు నమోదు చేయడమైనది. ఈ దాడుల్లో పెద్దాపురం ఎస్ఇబి ఎస్‌హెచ్ఓ ఎం. రామకృష్ణదాస్, ఎస్ఐలు జె.విజయ కుమార్. కె.తాతారెడ్డి, తదితర సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.



శ్రీ శార్వరి నామ సంవత్సరంనకు గాను ఎరుక దినపత్రిక ముద్రించిన వరలక్ష్మి వ్రత కల్పం పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించిన వీఎంఆర్డీఏ మాజీ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు. చిత్రంలో దినపత్రిక బ్యూరో చీఫ్ నారాయణ్. పోతుమహంతి

## ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన

### - సదుపాయాలు కల్పనకు చర్యలు : మంత్రి మల్లాడి



యానాం : యానాం ప్రభుత్వాసుపత్రిని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణా రావు బుధవారం పరిశీలించారు. అసంపూర్ణంగా ఉన్న వైద్య సదుపాయాలు గురించి, పలు సమస్యలను పలువురు మంత్రి మల్లాడి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఆస్పత్రిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఓపిడి విభాగాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. మందులు కావలసినవారు తమ ప్రాంతాల్లో ఉన్న ఆశా వర్కర్ల ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. అనం తరం ఆస్పత్రి ప్రాంగణంలో గల డస్ట్ బిన్ లు పరిశీలించి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి వాటిని శు భ్రం చేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధి ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విధులు నిర్వర్తించే ఏఎన్ఎం లకు పలు సూచనలు చేశారు. హౌస్ క్వారెంటేన్ లో ఉన్న వారికి పాటించవలసిన జాగ్రత్తలను సూచించి బయటకు రాకుండా అవగాహన కల్పించా లన్నారు. ఆస్పత్రిలో కావలసిన సదుపాయాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా రోగులు ఇబ్బంది పడకుండా కావలసిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది అందరూ కష్టించి పనిచేసి వైరస్ నివారణకు పాటుపడాలి అన్నారు .రోగుల ద్వారా ,ప్రజల ద్వారా ఆస్పత్రి, వైద్య సదుపాయాలపై ఎటువంటి ఆరోపణలు వచ్చినా సహించేది లేదని వైద్య అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్, ప్రజా పనుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దారా సుబ్బరాజు ఇతర వైద్య సిబ్బంది ఆయనతో ఉన్నారు.

## దళితులపై దాడులను అరికట్టాలి




ఎస్పైకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గొలుగొండ : రాజమండ్రిలో దళిత యువతిపై జరిగిన అత్యాచారం, సీతానగరం పోలీస్‌స్టేషన్లో దళిత యువకునికి శిరోమండనం, చీరాలలో దళిత యువకుడి మరణాలపై చట్టపరమైన విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసిస్తూ బుధవారం గొలుగొండ మండలం ఏఐఎం కమిటి నాయకులు గొలుగొండ తహశీల్దార్, గొలుగొండ ఎస్పై నారాయణరావుకు వినతిపత్రాలు అందజేశారు.

తక్షణమే నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోగంపేట, మల్లం పేట, గింజర్తి, గాదంపాలెం, గొలుగొండ ఏఐఎం నాయకులు పాల్గొన్నారు.

## కరోనా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి



దేవరాపల్లి : విశాఖపట్నం విమ్స్ ఆసుపత్రిలో 500 పడకల సామర్థ్యం పెంచాలని, కరోనా బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారా యణ, డి.వెంకన్న కోరారు. బుధ వారం జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ కు మెయిల్ ద్వారా వినతి పత్రం పంపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వర్షా కాలంలో వ్యాధులు వ్యాపిస్తు న్నందున అన్ని ప్రభుత్వ ఆసు పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## శాస్త్రీయ ఆధారాలు లేని మూఢనమ్మకాలను విడనాడండి

### - విజయనగరం జిల్లా ఎస్పీ



విజయనగరం : విజయనగరం జిల్లాలో ఇటీవల ప్రజలు మూఢనమ్మకాలతో చట్టాన్ని తన చేతుల్లో తీసుకొని, దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలకు, పోలీసులకు అవగాహన కల్పించేందుకుగాను విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి జన విజ్ఞాన వేదిక సహకారంతో అవగాహన సదస్సును బుధవారం పోలీసు పరేడ్ గ్రౌండులో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ - శాస్త్రీయ ఆధారాలు లేని మూఢనమ్మకాలను ప్రజలు విడనాడా లన్నారు. ఇటీవల జిల్లాలో మూఢనమ్మకాలు కారణంగా చిల్లంగి, చేతబడులు, బాణామతి పేరుతో అమాయకులైన వారిపై భౌతిక దాడులకు తెగబడుతూ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారన్నారు. ఇది మంచి విధానం కాదని, ఇలా చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోక తప్పదనిజిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఎఆర్ డిఎస్పీ శ్రీ ఎల్. శేషాద్రి మాట్లాడుతూ - ప్రజలకు శాస్త్రీయ దృక్పథాన్ని తెలియజేసి, అవగాహన కల్పించేందుకుగాను జన విజ్ఞాన వేదిక సభ్యుల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. గిరిజన, మైదాన ప్రాంతాల్లో ప్రజలకు శాస్త్ర విజ్ఞానాన్ని, శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొం దించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. జెవివి జాతీయ కమిటీ అధ్యక్షులు డా॥ ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ ప్రజల్లో మూఢ విశ్వాసాలు, నమ్మకాలను రూపు మాపి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకుగాను పోలీసుశాఖ సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకుగాను సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. మూఢ నమ్మకాల కారణంగానే జిల్లా అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ఉపాధ్య క్షులు మండల సత్యన్నారాయణ మాట్లాడుతూ చిల్లంగి, బాణామతి, చేతబడి వంటివి లేవన్నారు. ప్రజల బలహీనతలను కొంతమంది స్వార్ధపరులు తమకు అనుకూలంగా మలుచుకుటుంన్నారన్నారు. మూఢనమ్మకాలను, ఛాందశ భావాలను అరికట్టేందుకు సైన్స్ ప్రచార సంస్థ కృషి చేస్తుందన్నారు. డా॥ ఎ.వి. రాజశేఖర్ మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలు¬ కారణాలు¬ పరిష్కార మార్గాలు గురించి వివరించారు. జెవివి రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనరు గుండ్రేటి శ్రీనివాసరావు¬ భూత వైద్యులు ప్రజలను ఏవిధంగా మోసగిస్తున్నది తాను మ్యాజిక్ చేసి, చూపించి, ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యవంతులను చేశారు. మూఢనమ్మకాలపై చైతన్య గీతాలను ఆయన ఆలపించారు.

ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, జెవివి జాతీయ కమిటీ అధ్యక్షులు డా॥ ఎంవిఆర్ కృష్ణాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల సత్యన్నారాయణ, డా॥ ఎ.వి. రాజశేఖర్, గుండ్రేటి శ్రీనివాసరావు, ఎస్బీ సిఐ ఎన్. శ్రీనివాసరావు, 2వ పట్టణ సిఐ డి. శ్రీహరిరాజు, జెవివిప్రధాన కార్యదర్శి ఎరుకొండ ఆనంద్, జిల్లా ప్రతినిధులు ఎస్. శివాజీ, సూర్యనారాయణ, పైల రమేష్ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల అమ్మవారు గా రత్నగిరి వనదుర్గమ్మ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో క్షేత్రపాలకురాలైన శ్రీ వనదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా వనదుర్గమ్మ వారు బుధవారం బాల అమ్మవారు గా భక్తులకు దర్శనమిచ్చారు.కార్యక్రమంలో ముందుగా ఆలయ అర్చకులు శ్రీ వనదుర్గమ్మ వారిని బాల అమ్మవారుగా వివిధ రకాల సుగంధ భరితమైన పుష్పములతో అలంకరించారు. అనంతరం వైదిక కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు, వ్రత పురోహితులు ఉత్సవాల్లో భాగంగా పరిమిత సిబ్బందితో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర. త్రినాధ రావు,డిప్యూటీ ఈవో జగన్నాథరావు బాల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కొండవీటి. సత్యనారాయణ,దేవస్థానం ఈవో వి.త్రినాథరావు డిప్యూటీ ఈవో ఈరంకి. జగన్నాథరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ లక్ష్మణస్వామి, పెండ్యాల భాస్కరరావు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తవ్వకాలను ఆపాలి

### రాష్ట్ర టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత



కోటఉరట్ల : మండలంలో గొట్టివాడ గ్రామ పంచాయతీ వరహనదిలో జరుగుతున్న అక్రమ ఇసుక పై రాష్ట్ర బుధవారం ఎమ్మార్వో రామారావుకు పిర్యాదు చేసారు.పత్రిక విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ మహిళా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాయకరావు పేట నియోజకవర్గ మొత్తానికి కోటఉరట్ల మండలంలో జరుగుతున్న అవినీతి ఎక్కడ జరగలేదని అన్నారు.360 క్యూబిక్ మీటర్లకు ఇసుక పర్మిట్ ఇస్తే జూన్ 17 నుండి ఇప్పటి వరకూ రోజుకు ట్రాక్టర్లు ద్వారా వందల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీసీ అక్రమ రవాణా చేసి ట్రాక్టర్ కు 6000 నుండి 8000 రూపాయలు చొప్పున కొందరు వైఎస్సార్ సిపి నాయకులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.సామాన్య మానవులు ఇల్లు కట్టుకోవడానికి ఇసుకకు ఎమ్మార్వోకి ధరఖాస్తు చేస్తే పది రోజులైనా ఇసుక రాదు అదే ఇసుక దళారులు చెప్పతే యొగమోగాల మీద ఇసుక వస్తుంది అని అన్నారు. ఇసుక రవాణా చేయుటకు సాయంత్రం 5గంటలతో అయిపోయింది కదా టైమ్ దాటినా మీరు ఇంకా ఇసుక రవాణా చేస్తున్నారని నిలదీస్తే మా టిడిపి కార్యకర్తలు పై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు లాలం కాశీనాయుడు, టీడీపీ నాయకులు వేచలపు జనార్దన్, సుంకర బాబ్జీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్ విధానాన్ని వాయిదా వేయాలి

### - అధికారులకు యానిమేటర్లు వినతి పత్రం



దేవరాపల్లి : కరోనా ఉద్ధృతి తగ్గేవరకు బయోమెట్రిక్ పని విధానం వాయిదా వేయాలని కోరుతూ బుధవారం తహశీల్దార్ జే. రమేష్ బాబు, ఎంపీడీఓ సిహెచ్. సుబ్బలక్ష్మి కు వైఎస్సార్ క్రాంతి పథం మండల యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం, మండల సిపిఎం కార్యదర్శి సిహెచ్. రాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ ప్రక్క కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు బయటకు రావద్దని, భౌతిక దూరాన్ని పాటించాలంటూ, తెలియజేస్తూనే ఇందుకు భిన్నంగా డ్వాక్రా మహిళలతో బయోమెట్రిక్ చేయించాలని సెర్ప్ నుంచి సర్క్యులర్ విడుదల చేశారు. కరోనా వైరస్ సోకకుండా వివోఏలు నీళ్ళ బకెట్, సోప్ వెంట తీసుకు వెళ్లాలని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. కరోనా వైరస్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈ బయోమెట్రిక్ విధానాన్ని వాయిదా వేసి మా యానిమేటర్స్ ను కరోనా బారి నుంచి కాపాడాలని వారు కోరు తున్నారు. ఈ కార్యక్రమంలో కే. సూరిబాబు, జి. రాము, డి. వరలక్ష్మి, వి లీల, కె.అప్పారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ద్రోణంరాజు శశి శ్రీనివాస్ అందిస్తున్న.. శ్రీ కృష్ణ ప్రవచనాలు ఘనంగా ప్రారంభం



### భక్తిశ్రద్ధలతో.. ప్రత్యేక పూజలు, దీపారాధన

విశాఖపట్నం : ద్రోణంరాజు శశి శ్రీనివాస్ అందిస్తోన్న.. శ్రీ కృష్ణ ప్రవచనాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా.. శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో.. ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

శ్రీ కృష్ణ ప్రవచనాల భక్తి కార్యక్రమం జరిగినంత కాలం.. ప్రతీ రోజు ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. సంస్థ మహిళా సభ్యులందరూ.. భక్తిశ్రద్ధలతో ప్రవచనాలను ఆలకించారు.

# శ్రీకాకుళంలో సచివాలయాలలో కంట్రోల్ రూమ్‌లు



శ్రీకాకుళం : శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో సచివాలయాల్లో కోవిడ్ కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమీషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ నగరంలో కోవిడ్ వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి కంటైన్మెంట్ జోన్ల పర్యవేక్షణ, కోవిడ్ వ్యాప్తి నిరోధానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ లు రేయింబవళ్ళు పనిచేస్తాయని పేర్కొంటూ ప్రజలు కరోనా సమాచారాన్ని, పిర్యాధులను, సలహాలను అందించాలని కోరారు. వార్డు సచివాలయంలోని వార్డు పరిపాలన కార్యదర్శి, వార్డు విద్యా మరియు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వార్డు సంక్షేమ కార్యదర్శులకు మొబైల్ ఫోన్ నంబర్లను సమకూర్చడం జరిగిందని పేర్కొంటూ వాటి వివరాలు ఈ విధంగా అందజేశారు. బలగ సచివాలయం ఎస్.ఢిల్లేశ్వరావు 9154564569, ఆదివారం పేట వై.స్వరూప్ కుమార్ 9154564602, బాబాజీ తోట జి.రాంబాబు 9154564584, రిమ్స్ రోడ్ ఎస్.ముసలనాయుడు 9154564591, హడ్కో కాలనీ ఎల్.జ్ఞానేశ్వర్ రావు 9154564618, శాంతినగర్ - రెల్లి వీధి ఎస్.దివ్య కుమారి 9154564600, సానావీధి ఎం.సురేష్ కుమార్ 9154564610, డిసిసిబి కాలనీ టీ.తారకేశ్వరి 9154564588, రైతు బజార్ ఏరియా పి.తులసి 91545 64587, పెద్ద రెల్లివీధి వై.మల్లేశ్వరి 9154564573, పుణ్యపు వీధి ఆర్.జగన్నాయకులు నాయుడు 9154564582, గొంటి వీధి వై.సాగర్ కుమార్ 9154564596, ఇప్పిలి వీధి వై.సాగర్ కుమార్ 9154564615, హెడ్ పోస్ట్ ఆఫీస్ రోడ్డు ఎస్.భారతి 9154564611, బాకార్ సాహెబ్ పేట కింతలి సాయి తేజ 9154564608, చంపాగల్లీ వీధి టి.పవన్ కుమార్ 9154564585, మండల వీధి ఏ.చంద్రమౌళి 9154564578, మహాలక్ష్మి నగర్ ఎస్.సాయి కిరణ్ 9154564575, అరసవల్లి రోడ్డు సిహెచ్.సుశీల 9154564592, అరసవల్లి వెలమ వీధి రత్న రవితేజ 9154564570, బాదుర్లపేట ఎస్.అపర్ణ 9154564576, సి.బి రోడ్డు గూట్ల పృథ్వీరాజ్ 9154564597, దండి వీధి హారిక కరణం 9154564572, హెచ్.బి.కాలనీ, టిపిఎం స్కూల్ రోణంకి ప్రశాంతి 9154564613, గూనపాలెం బొత్సా ఝాన్సీ భాయి 9154564617, కాకి వీధి కె.శ్రీనివాస రావు 91545 64595, కంపోస్ట్ కాలనీ పి.శ్రీనివాసరావు 9154564605, మంగువారితోట కళ్యాణి హేమ సుందర్ 9154564583, దమ్మల వీధి దుర్గారావు గేదెల 9154564590, గుడి వీధి చింటూ ప్రభాకర రావు 9154564619, హయతీనగరం టి.గుణ సూర్య సత్య సాగరి 9154564594, చౌదరి సత్యనారాయణ కాలనీ టి.నరసింహ అప్పారావు 9154564593, గుజరాతీపేట ఆత్రేయపురపు రామారావు 9154564566, గుజరాతీపేట గొల్ల వీధి టి.జాన్ ప్రసన్నకుమార్ 9154564606, ఫాజుల్లాబేగ్ పేట చక్కా పద్మావతి 9154564603, పి.ఎన్.కాలనీ కె.మురళీమోహన్ నారాయణరావు 9154564599, మున్సిపల్ ఆఫీస్, ఓల్డ్ బస్ స్టాండ్ ఏరియా తల్లూరి పవన్ కుమార్ 9154564585, సీపన్నాయుడుపేట సీపాన సత్యనారాయణ 9154564571. ఈ ఫోన్ నంబర్లను ప్రజలు సద్వినియోగం చేసుకుని కోవిడ్ లక్షణాలుగాని సాధారణ జలుబు, దగ్గు, జ్వరం వంటి రుగ్మతలు ఉన్నప్పటికి తెలియజేసి ఆరోగ్య సమస్యలు రాకుండా ప్రాణరక్షణ చర్యలు చేపట్టాలని కమీషనర్ కోరారు.

# మత్స్యకారులుకు సిఎం జగన్ పెద్దపీట

- హర్షం వ్యక్తం చేసిన ముత్యాలమ్మపాలెం మత్సకారులు
- మత్సకార రైతులకు డిజిల్ సబ్సిడీ కార్డులు పంపిణీ



పరవాడ : పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ లో సముద్రం పై జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలు జీవన స్థితిగతులు జగనన్న దృష్టి కి మత్స్యకార నాయుకులు తీసుకు వెళ్ళగా, నాడు ప్రజా భరోసా పాదయాత్రలో సీఎం జగనన్న ఇచ్చిన మాట ప్రకారం, చేపలు వేట చేసే మత్స్యకార రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ డీజిల్ సబ్సిడీ కార్డులు ఎఫ్‌డిఒ ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బొంది ధనలక్ష్మి మసేను చేతులు మీదుగా మత్స్యకార రైతులకు డీజిల్ సబ్సిడీ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సురాడ చిన మసేను , మాజీ కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సురాడ ముత్యాల రావు, ముత్యాలమ్మ పాలెం ఎమ్ పిటిసి అభ్యర్థి అరిజిల్లి దేవి రవి, అరిజిల్లి మసేను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దేవరాపల్లిలో భారీ వర్షం

- ఉపందుకున్న వరినాట్లు



దేవరాపల్లి : ఖరీఫ్ వరినాట్లు ఊపందుకున్న సమయంలో మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీనితో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైవాడ జలాశయం దిగువన ఉన్న ఆయకట్టు భూములకు ఆగస్టు 4న సాగునీరు విడుదల చేస్తున్నట్లు జలాశయం డి ఈ మాధవి తెలిపారు. దేవరాపల్లిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో 47 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 111.90 మీటర్లు వద్ద నమోదైనట్లు ఆమె తెలిపారు.

మండలంలో ఒకేసారి 4 సెంటీ మీటర్లు వర్షం పడడంతో రైతాంగం మిగిలిన వరినారు మడులు దమ్ములు పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.



### రత్నగిరిపై కోవిడ్-19 కారణంగా

# వరలక్ష్మి వ్రతములు నిలుపుదల



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానంలో శ్రావణ మాసంలో జరగవలసిన వరలక్ష్మి వ్రతములు కరోనా వైరస్ తూ.గో.జిల్లా లో విస్తృతుంగా వ్యాప్తి చెందుతున్న కారణంగా స్వామివారి దేవస్థానం నందు నిర్వహించు శ్రీ వరలక్ష్మీ అమ్మవారి వ్రతములు నిలుపుదల చేయడమైనది. కావున భక్తులు సహకరించవలసిందిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కోరారు.

# ఊపందుకున్న శ్రావణమాసం అమ్మకాలు



యలమంచిలి: యలమంచిలి పట్టణంలో శ్రావణమాసం అమ్మకాలు ఊపందు కున్నాయి. ప్రజలు పెద్దఎత్తున సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. పరసర గ్రామాల నుంచి సైతం ఎక్కువ మంది పట్టణానికి సరకులు, దుస్తులు, బంగారం కొనుగోళ్లకు రావడంతో దుకాణాలన్నీ కొనుగోలుదారులతో నిండుగా కనిపిస్తున్నాయి. రోడ్లున్నీ రద్దీగా మారాయి. ఉదయం 8 గంటలకే దుకాణాల వద్ద రద్దీ కనిపిస్తోంది. బంగారం ధర రోజురోజుకీ పెరుగుతున్నా అమ్మకాలు తగ్గడం లేదు. వస్త్ర దుకాణాల్లో రద్దీ మరింతగా ఉంటోంది.

జనం గుంపులుగా తిరగడం వల్ల కరోనా వ్యాపించే ప్రమాదం ఉందని పోలీసులు వాహనాల్లో తిరిగి ప్రచారం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

# ప్రజలకు ఎవరికి చిన్న కష్టమొచ్చినా ఆదుకునే ప్రభుత్వం వైయస్సార్ పార్టీ ఒకటే..

## - గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి



గాజువాక : జివియంసి పరిధి అయిన 76 వార్డులో ఆనంగి హరినాథ్ 34 సంవత్సరాల వ్యక్తి ప్రమాదవశాత్తు 6 అంతస్తుల భవనం పైనుంచి పడి మరణించడంతో ఆ కుటుంబాన్ని ఏదో విధంగా సాయం చేయాలనే దృఢ సంకల్పంతో శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి గారి ఆదేశాల మేరకు వార్డు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దొడ్డి రమణ సర్దార్ నెస్ట్ వెంచర్ అధికారులతో మాట్లాడి సుమారు 10 లక్షల రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడానికి మాట్లాడి ఒప్పించారు. అనంతరం ఈ రోజు శాసన సభ్యులు వారి నివాసంలో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే గారి చేతులమీదుగా చెక్కును అందజేశారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా , సుఖశాంతులతో జీవించాలన్నదే మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యొక్క ముఖ్య ఉద్దేశమని చెప్పారు దీర్ఘకాలిక వ్యాధులు వ్యాపించి మెరుగైన వైద్యం చేయించుకోలేని పేద ప్రజలకు,60 సంవత్సరాల లోపు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే ఆ కుటుంబానికి వైయస్సార్ బీమా పథకం వర్తింపుచేస్తుందని అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులను మంజూరు చేస్తు వారి ఆరోగ్య పరిరక్షణకు చేయూతనందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

అంతే కాకుండా వేయిరూపాయలు దాటి వైద్యం చెయించుకునే ప్రతి ఒక్కరికి కార్పరేటు హాస్పిటల్ లో ఉచితంగా వైద్యసదుపాయాలను కూడా మన ముఖ్యమంత్రి అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు . అలాగే ఆ కుటుంబానికి అధైర్యపడకుండా ధైర్యం చెప్పి ఇంతటి సహాయ సహకారలు అందజేసిన మన 76 వార్డు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దొడ్డి రమణ కు ప్రత్యేక అభినందనలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మర్థా పూడి పరదేశి, పిట్టా రెడ్డి, గాలి శ్రీనివాసరావు, కాకినాడ పెంటారావు, అండ్ బోయిన సన్నీ, ములకలపల్లి వెంకటేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా వైరస్ అంతం కోరుతూ హరేకృష్ణ మూమెంట్ భక్తులు 139 కోట్ల హరినామ మంత్రం జపయజ్ఞం



ప్రపంచానికి కరోనా వైరస్ ముప్పు నేపథ్యంలో, మా ఆధ్యాత్మిక గురువు ఎ.సి భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల వారి అడుగుజాడలను అనుసరించి, భారతదేశానికి భాద్యతగల పౌరులుగ హరే కృష్ణ మూవ్మెంట్, విశాఖపట్నం వారు లోక కళ్యాణార్థం కోసం "హరి నామ జప యజ్ఞం" ప్రారంభించారు. ఈ జప యజ్ఞం యొక్క లక్ష్యం 139 కోట్ల సార్లు "హరే కృష్ణ" పవిత్ర నామాన్ని జపించడం.ప్రస్తుత సమాజంలో, ప్రపంచంలో అన్ని సమస్యలకు, ఒకే ఒక పరిష్కారం "హరినామ సంకీర్తనం".

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే హరే రామ హరే రామ రామ రామ హరే హరే

ఇది కలియుగ తారక మంత్రం మరియు తిరుగులేని బ్రహ్మాస్త్ర ఆయుధం.

హరే కృష్ణ మూవ్మెంట్, విశాఖపట్నం వారు ఈ హరే కృష్ణ మంత్ర జప యజ్ఞాన్ని ఏప్రిల్ 1, 2020 న ప్రారంభించారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య వివరాలు.

1.ఈ హరే కృష్ణ మంత్రం జప యజ్ఞ లక్ష్యం 139 కోట్ల పవిత్ర నామాలను జపించడం.

2.జులై 20 నాటికి 110 కోట్ల పవిత్ర నామాలను జపించారు. 3.ఈ యజ్ఞంలో పాల్గొన్న మొత్తం భక్తుల సంఖ్య 1710 మరియు రోజు రోజుకి ఈ సంఖ్య పెరుగుతుంది. శ్రీమద్ భాగవతంలో ఈ విధంగా చెప్పబడింది (6.3.31 )

తస్మాత్ సంకీర్తనం విష్ణోర్ జగత్ మంగళ అంహాసాం

మహతాం అపి కౌరవ్య విద్ధి ఐకాంతిక నిష్కృతం

శుకదేవ గోస్వామి ఇట్లు పలికెను: ఓ ప్రియమైన రాజ, హరినామసంకీర్తనము ఘోర పాపములనైనా సమూలముగా నశింపచేయగలదు. కనుక నామ సంకీర్తనమే అఖిల జగత్తునకు పరమ మంగళప్రదమగు కార్యము. ఈ విషయమును నీవు తెలుసుకొనినచో ఇతరులును దానిని గంభీరంగా స్వీకరింతురు. ఇది శ్రీమద్ భాగవతం 12.3.51 లోని మరొక ప్రదేశంలో చెప్పబడింది

కలేర్ దోష నిధే రాజన్ అస్తిర్ ఎకో మహాన్ గుణ

కీర్తనాత్ ఏవ కృష్ణస్య ముక్త సంగ పరం వ్రజేత్

రాజా! కలియుగము దోషసాగరమే అయినప్పటికిని దీనిలో ఇంకను ఉన్నట్టి ఒక మహాగుణమేమనగా కేవలము హరేకృష్ణ మహామంత్రమును కీర్తించుట చేతనే మనుజుడు భవబంధ విముక్తుడై పరంధామమునకు చేరగలుగుచున్నాడు.

హరే కృష్ణ మూవ్మెంట్, విశాఖపట్నం వారు, శ్రీమద్ భాగవతంలో పైన పేర్కొన్న వివరణ ఆధారంగ గత 115 రోజులుగా "హరి నామ జప యజ్ఞ" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో 1710 మంది భక్తులు పాల్గొన్నారు, దాని ఫలితంగా ఈ రోజు వరకు 110 కోట్ల సార్లు పవిత్ర హరిణామాన్ని పూర్తి చేసారు మరియు హరే కృష్ణ మహా మంత్రాన్ని 6 లక్షల యాభై వేల రౌండ్లు జపించారు.

ఒక రౌండ్ జపం అనగా 108 సార్లు హరే కృష్ణ మంత్రాన్ని జపించడం

పతిత పావనమైన ఈ హరే కృష్ణ మంత్రాన్ని, విశాఖపట్నం పౌరులందరూ ప్రతిరోజూ కనీసం 108 సార్లు జపించాలని మరియు ఈ జప యజ్ఞానికి అందరు సహకరించాలని మేము హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాము. ప్రపంచానికి మరియు మన వైజాగ్ నగరానికి శుభమును మరియు పున్యమును తీసుకురావడానికి పౌరులందరి మద్దతు అవసరం. దయచేసి ఈ "జప యజ్ఞంలో" పాల్గొనండి, ఆనందించండి మరియు తరించండి.

ఆ భగవంతుడు యొక్క ఆస్సీసులు ఎల్ల వేళ్ళల మీ కుటుంబం మీద ఉండుగాక.

"సర్వే జన: సుఖినో భవంతు"

హరే కృష్ణ మహా మంత్రాన్ని జపించడం వల్ల కలిగే ప్రయోజనాలు

1.చెడు అలవాట్లు, చెడు ఆలోచనలు, ప్రతికూల భావోద్వేగాలను మన నుంచి తొలగించును. 2.భయం, ఒత్తిడి మరియు ఆందోళన నుండి బయటపడగలము. 3.దీని వలన శాంతి మరియు ఆనందాన్ని పొందుతాము. 4.అన్ని కష్టాల నుండి మనకు ఉపశమనం కలుగుతుంది. 5.ఇది మన మనస్సు మరియు హృదయాన్ని శుభ్రపరుస్తుంది.

హరే కృష్ణ జప యజ్ఞ కార్యక్రమం గురించి ఆలయ భక్తులు ఏమి చెబుతారు.

గత 110 రోజుల నుండి ఇప్పటి వరకు 1710 మంది భక్తులు ఈ జప యజ్ఞంలో పాల్గొని హరే కృష్ణ మంత్రాన్ని జపించారని చెప్పడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇంకా చాలా మంది జపం చేయడం కొనసాగిస్తున్నారు. విశాఖపట్నం హరే కృష్ణ ఉద్యమం తరపున వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.



యదురాజా దాస , మిషనరీ, హరే కృష్ణ మూవ్మెంట్ , విశాఖపట్నం

వైజాగ్ మరియు ప్రపంచవ్యాప్తంగా ప్రజల సంక్షేమం కోసం ప్రభువు పవిత్ర నామాలను జపించే హరినామ జప యజ్ఞాన్ని ప్రారంభించామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. గత 82 రోజుల నుండి మేము దీన్ని చేస్తున్నాము మరియు మరింత కొనసాగించాలని కోరుకుంటున్నాము మరియు మన సమాజం మరియు భక్తులచే మేము ఎంతో ప్రోత్సహించబడుతున్నాము, మా ఈ గొప్ప యజ్ఞం లో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు, మంచి ఆరోగ్యం మరియు శ్రేయస్సుతో ఆశీర్వదించమని మా ఆచార్యులు గారిని వైజాగ్ మరియు మొత్తం ప్రపంచం తరపున ప్రార్థిస్తున్నాము.

- శృతి సాగర దాస, మిషనరీ, హరే కృష్ణ ఉద్యమం

శ్రీమద్ భాగవతం దుర్మార్గపు సమయాల్లో శుభప్రదమైన ప్రార్థనను సిఫారసు చేస్తుంది. ప్రస్తుతం ప్రపంచం మొత్తం దుర్మార్గపు సమయం ప్రభావంలో ఉంది. శ్రీమద్ భాగవతం సిఫారసు చేసిన ప్రక్రియ ఆధారంగా, మేము గత 3 నెలలుగా హరి నామ జప యజ్ఞాన్ని ప్రారంభించాము. ఈ రోజు నాటికి 1600 మంది పాల్గొంటున్నారు, వారు ప్రపంచమంతా శుభప్రదంగా ఉండటానికి స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ హరి నామ జప యజ్ఞాన్ని జపించడానికి మరియు ఈ మొత్తం ప్రపంచానికి శుభప్రదతను తీసుకురావడానికి భక్తులు విలువైన సమయాన్ని మరియు శక్తిని కేటాఇంచి నందుకు జపా యజ్ఞ వాలంటీర్లందరికీ మేము ఎంతో రుణపడి ఉన్నాము.

# 'ప్రపంచ పులుల దినోత్సవం' పోస్టర్ విడుదల



తాడేపల్లి: ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ రూపొందించిన పోస్టర్లు, బ్రోచర్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పులుల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణ కోసం చేపడుతున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 3727.82 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు దేశంలోనే అతిపెద్దదని, ప్రస్తుతం అక్కడ 60 పులులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పులులు సంఖ్య నానాటికీ తగ్గిపోతున్నా.

రాష్ట్రంలో చేపడుతున్న సంరక్షణ చర్యల వల్ల పులులు సంఖ్య పెరిగిందని అటవీశాఖ అధికారులు సీఎం జగన్ దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా పులుల రక్షణ అటవీ వన్యమృగాల సంరక్షణలో నాగార్జున సాగర్-శ్రీశైలం రిజర్వు ఫారెస్టులో ఉన్న ఆదిమ చెంచు తెగలు గొప్ప పాత్ర పోషిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫారెస్టు రిజర్వు నిర్వహణలో చెంచుల సహకారంతో సమర్థవంతమైన మానవ వనరుల నిర్వహణకు గాను భారత ప్రభుత్వం, నేషనల్ టైగర్ కన్సర్వేషన్ అథారిటీ ఎక్సెలెన్స్ అవార్డును ప్రదానం చేసినట్లు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న పులుల జాతిని సంరక్షించేందుకు అటవీ శాఖ అధికారులు చేస్తున్న కృషిని సీఎం జగన్ అభినందించారు.

ఈ సమావేశంలో నీరబ్‌కుమార్ ప్రసాద్, (అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ సిఎస్) ఎన్. ప్రతీప్ కుమార్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్), అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# మూడేళ్లలో 44 వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు

## రైళ్ల సంఖ్య పెంపు దిశగా కేంద్రం అడుగులు

దిల్లీ: రైల్వే శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దేశీయ తొలి సెమీ హైస్పీడ్ రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సంఖ్య పెంపు దిశగా ఆ శాఖ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. రాబోయే మూడేళ్లలో అంటే 2022 నాటికి వీటి సంఖ్య 44కి పెంచనున్నట్లు రైల్వేశాఖ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు రైళ్లను చైన్నై, రాయ్‌బరేలి, కపుర్తలలో ఉన్న కోచ్ ఫ్యాక్టరీలతో వీటిని తయారు చేయనున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో ప్రవేశపెట్టిన రెండు రైళ్లను చైన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో (ఐసీఎఫ్) తయారు చేసిన సంగతి తెలిసిందే. కొద్ది నెలల క్రితం ఈ రైళ్ల తయారీకి సంబంధించి కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే బోర్డు ఛైర్మన్ వీకే యాదవ్ తెలిపారు.

రాబోయే రెండు మూడేళ్లలో ఈ రైళ్లు పట్టాలపై పరుగులు పెట్టనున్నట్లు తెలిపారు. ప్రొటోటైప్ రైళ్లను కమర్షియల్ సేవలకు అందుబాటులోకి తెచ్చేందుకు 28 నెలల సమయం పడుతుందని ఐసీఎఫ్ రైల్వే బోర్డుకు రాసిన లేఖలో పేర్కొంది. అలానే తయారీ ప్రారంభించేందుకు మరో ఆరు నెలల వ్యవధి పడుతుందని వెల్లడించింది. మొత్తం 44 రైళ్ల తయారీ 78 నెలల వ్యవధిలో పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

# సింహాచలం అభివృద్ధికి ప్రసాదం పథకంలో రూ.53 కోట్లు

## పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : దేవాలయ పర్యాటకం లో భాగంగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి రూ.53 కోట్లు కేంద్ర నిధులు మంజూరైనట్లు ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. లిప్రసాద్‌లి (నేషనల్ మిషన్ ఆన్ పిలిగ్రిమేజ్ రెజువినేషన్ అండ్ స్పిర్చువల్ అజ్‌మెంటేషన్ డ్రైవ్) పథకంలో సింహా చలం దేవాలయ అభివృద్ధికి కేంద్ర పర్యాట కశాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ ఈ మొత్తాన్ని మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో ఆలయంలో పర్యాటక రంగ అభివృద్ధికి తగిన విధంగా ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ నిధుల కొరకు లేఖ రాసిన వెంటనే స్పందించి నిధులను విడుదల చేసిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి వారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

### సంచయిత గజపతిరాజుకు

# కేంద్రం ప్రశంసలు

## సింహాచలం దేవస్థానాన్ని ప్రసాద్ స్కీమ్‌కు ఎంపిక చేసిన కేంద్రం



విశాఖపట్నం: చారిత్రాత్మక దేవాలయ మైన సింహాచలం అప్పన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న మాన్సాస్ ట్రస్ట్ చైర్ పర్సన్ సంచయిత గజపతి రాజుపై కేంద్రం బుధవారం ప్రశంసలు కురిపించింది. ఈ సంద ర్భంగా నేషనల్ మిషన్ ఆన్ పిలిగ్రిమేజ్ రెజువినేషన్ అండ్ స్పిర్చువల్ అజ్‌మెంటేషన్ డ్రైవ్(ప్రసాద్) పథకానికి సింహాచలం దేవస్థానాన్ని ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించింది. 11వ శతాబ్దానికి చెందిన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పర్యావరణ మంత్రిత్వ శాఖ ట్వీట్ చేసింది. కాగా దేశంలో ముఖ్యమైన పర్యాటక, ఆధ్యాత్మిక, ధార్మిక ప్రదేశాలు అభివృద్ధి చేసేందుకు కేంద్రం "ప్రసాద్" పథకాన్ని అమలు చేస్తుంది. రాష్ట్రంలో శ్రీశైలం, తిరుపతి దేవస్థానాలను ఇప్పటికే ఈ పథకం కింద ఎంపిక చేసి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నారు.

# ప్రపంచ దేశాలకు అమెరికా నుంచే వ్యాక్సిన్



వాషింగ్టన్: ప్రపంచమంతా కరోనా వ్యాక్సిన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాలకు అమెరికాయే వ్యాక్సిన్ అందించే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. పలు దేశాలు వ్యాక్సిన్ తయారీలో పురోగతి కనబరుస్తున్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "వ్యాక్సిన్ అందుబాటులోకి రాగానే దాన్ని అంతటా సరఫరా చేస్తాం. ఈ ప్రక్రియ దేశవ్యాప్తంగా శరవేగంగా జరుగుతుంది. వెంటిలేటర్లు, ఇతర వైద్య సామగ్రిని అందించిన తరహాలోనే వ్యాక్సిన్‌ను కూడా ప్రపంచదేశాలకూ అమెరికానే సరఫరా చేస్తుంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మోడెర్నా అభివృద్ధి చేస్తున్న కరోనా టీకాపై ట్రంప్ బృందం అత్యంత విశ్వాసంగా ఉంది. 2021 ఆరంభానికి వ్యాక్సిన్ ప్రజా వినియోగానికి అందుబాటులోకి రావొచ్చని బలంగా విశ్వసిస్తోంది. మోడెర్నా టీకా తయారీలో కీలక ప్రక్రియ అయిన మూడో దశ క్లినికల్ ట్రయల్స్ సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. 30 వేల మంది వాలంటీర్లపై దీన్ని ప్రయోగించనున్నారు.

# విద్యా మంత్రిత్వ శాఖగా మారిన హెచ్‌ఆర్డీ

న్యూఢిల్లీ : మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ (హెచ్‌ఆర్డీ) శాఖ పేరును విద్యా మంత్రిత్వ శాఖగా మార్చే ప్రతిపాదనను బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఇస్రో మాజీ చీఫ్ కే కస్తూరిరంగన్ సారథ్యంలో ఏర్పాటైన నిపుణుల కమిటీ తొలుత మంత్రిత్వ శాఖ పేరు మార్చాలని సిఫార్సు చేసింది. నూతన విద్యా విధానం డ్రాఫ్ట్‌లో ఇది కీలక సిఫార్సు కావడంతో పేరు మార్పునకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. విద్య, బోధన, సాధన ప్రక్రియపై దృష్టి కేంద్రీకరించే దిశగా హెచ్‌ఆర్డీ శాఖను విద్యా మంత్రిత్వ శాఖగా మార్చాలని ఈ కమిటీ సూచించింది. జాతీయ విద్యా విధానానికీ కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

# రఘు రామ కృష్ణ రాజు.. మీ వైఖరి మార్చుకోండి

- పార్టీ గుర్తుపై గెలిచి పార్టీని విమర్శించడం తగదు
- రాష్ట్ర ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారు
- ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు




విశాఖ సిటీ: మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దయతో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తు పై గెలిచి అదే పార్టీ ని ప్రభుత్వాన్ని విమర్శించటం రఘు రామ కృష్ణ రాజు కు తగదని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బుధవారం ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మీడియా తో కె.కె.రాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి బొమ్మ పెట్టుకొని, వైస్సార్ పార్టీ గుర్తు పై ప్రజాస్వామ్య బద్దంగా గెలిచి పార్లమెంట్ లో అడుగు పెట్టిన రఘు రామ కృష్ణ రాజు ఇప్పుడు కొంతమంది స్వార్ధ పూరిత రాజకీయ నాయకుల డైరెక్షన్ లో ప్రజాస్వామ్యా విలువలకు తీట్లు పొడుస్తూ పొంతన లేని మాటలతో పార్టీ ని , ప్రభుత్వాన్ని విమర్శించటం తగదని అన్నారు. ఎక్కడో ఢిల్లీ లో కూర్చొని ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను విమర్శిస్తూ పక్క రాష్ట్రలతో మన రాష్ట్రం ను పోల్చి ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని అన్నారు. మన ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటినుంచి ఉన్న స్తానం నుండి ఉన్నత స్థానం కు తీసుకురావటానికి అహర్నిశలు పని చేస్తున్నారని ఇచ్చిన హామీల్లో 90% శాతం పైబడి నెరవేర్చటమే కాకుండా కరోన వంటి మహమ్మరిని ఎదుర్కోవడం లో అనేక రకాలుగా చర్యలు చేపట్టి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. అలాగే విశాఖ పరిపాలన రాజధాని విషయంలో కూడా మీ ఆరోపణలు సరైనవి కావని విశాఖ ను పరిపాలన రాజధాని చేయడానికి అన్నివిధాలా అర్హత ఉన్న నగరమని, అన్ని రవాణా మార్గాలు కనెక్టివిటీ , అర్హత గల నగరమని అలాగే రాష్ట్ర ప్రగతికి ఆర్థికంగా ఆదుకునే నగరం విశాఖ మాత్రమేనని ఆయన అన్నారు. కాబట్టి రఘు రామ కృష్ణ రాజు గారు మీరు ఒక పార్లమెంట్ సభ్యునిగా చేతనైతే సహకరించండి లేదంటే చెతులు కట్టుకుని కూర్చొండి తప్ప నోటికి వచ్చిన విధముగా మాట్లావద్దని ఈ సందర్భంగా తెలియజేశారు.

# కీలక అనుమానితులను విచారిస్తున్న సీబీఐ

కడప: మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో కీలక అనుమానితులను అధికారులు విచారిస్తున్నారు. పులివెందులకు చెందిన వైకాపా రాష్ట్ర కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కడపలో సీబీఐ విచారణకు బుధవారం ఉదయం హాజరయ్యారు. ఇతను కడప ఎంపీ వై.ఎస్ అవినాష్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడం విశేషం. వివేకా కుమార్తె సునీత హైకోర్టుకు సమర్పించిన 15 మంది అనుమానితుల జాబితాలో శివశంకర్ రెడ్డి పేరు కూడా ఉంది.

దీంతో ఇవాళ సీబీఐ ఆదేశాల మేరకు విచారణకు హాజరయ్యారు. వివేకా హత్య జరిగిన రోజు సంఘటనా స్థలంలో వై.ఎస్ కుటుంబ సభ్యులతోపాటు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి కూడా ఉన్నారు.

సాక్ష్యాలు తారుమారు చేయడానికి ఈయన కూడా సహకరించారని అప్పట్లో విమర్శలు వచ్చాయి.

# బాధ్యతలు చేపట్టిన మంత్రి శంకర్ నారాయణ, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ




అమరావతి: మంత్రి శంకర్ నారాయణ బుధవారం రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సదర్భంగా ఆయన తూర్పుగోదావరి జిల్లాలోని ఎదుర్లంక- జి.ముళ్లపాలెం రహదారి కొత్త వంతెన పనులకు సంబంధించిన ఫైల్‌పై మొదటి సంతకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శంకర్ నారాయణ్ మాట్లాడుతూ.. ఆర్ అండ్ బి శాఖ మంత్రిగా బాధ్యతలను తీసుకోవడం చాలా సంతోషంగా ఆనందంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ తనకు ఆర్ అండ్ బి శాఖ కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల అమలులో తనను ముఖ్య భాగస్వామిని చేశారని పేర్కొన్నారు. మొదటి సారిగా గెలిచిన తనకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పదవి ఇచ్చారని గుర్తు చేశారు. ఈ రోజు కీలక శాఖలు ఎస్సీ, ఎస్టీ బలహీన, మైనారిటీ వర్గాలకు కేటాయించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు వేల కిలోమీటర్ల రోడ్లు వేసేందుకు గాను రూ. 6400 కోట్లతో ఎన్డీబితో చేసుకున్న ఒప్పందంపై మొదటి సంతకము చేశానని పేర్కొన్నారు.

### చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

అదే విధంగా రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రిగా చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లాలోని డోన్‌లో బాలికల రెసిడెన్సియల్ స్కూల్, బేతంచెర్లలో బాలుర రెసిడెన్సియల్ స్కూల్‌ను జూనియర్ కాలేజీలుగా అప్ గ్రేడ్ చేసే ఫైళ్లపై మంత్రి వేణుగోపాలకృష్ణ తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. తను బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన వరాలన పంచుతానని తెలిపారు. బలహీన వర్గాల సంఘల నాయకుల సమస్యను సరైన రీతిలో పరిష్కరిస్తామని తెలిపారు.



మంత్రి శంకర్ నారాయణ వద్ద ఉన్న బీసీ సంక్షేమ శాఖను వేణుగోపాలకృష్ణకు కేటాయించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆంధ్రప్రదేశ్ నూతన మంత్రులుగా సీదిరి అప్పలరాజు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రులకు శాఖలు కేటాయించే క్రమంలో నలుగురు మంత్రుల శాఖల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ధర్మాన కృష్ణదాస్‌కు డిప్యూటీ సీఎం పదవితోపాటు, రెవెన్యూ శాఖ బాధ్యతలు అప్పగించారు. ధర్మాన వద్ద ఉన్న రోడ్లు, భవనాల శాఖను మంత్రి శంకర్ నారాయణకు కేటాయించారు.

# మధురవాడలో హొటళ్ల పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

- నిల్వ చేసిన ఆహారంతో నడుపుతున్న హొటల్స్ - ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడితో వెలుగు చూసిన వైనం
- ఆహార విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని హొటల్ యజమానులు
- కోవిడ్-19 గైడ్‌లైన్స్ లేకుండా యదేచ్ఛగా అమ్మకాలు - ఏకకాలంలో మధురవాడ లో పలు చోట్ల అధికారుల దాడులు
- కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



మధురవాడ : హొటళ్ల ఇష్టారాజ్యానికి బ్రేకులు వేశారు అధికారులు, కోవిడ్ 19 నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హొటళ్లు, రెస్టారెంట్ల పై కొరడా ఝలిపించారు. మహా విశాఖ జోన్ 1 పరిధి మధురవాడ మిధిలపురి ఉడా కాలనీ లో ఓ హొటల్ పై అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తమ స్వార్థం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రెస్టారెంట్, దాబా, హొటల్స్ తీరును బట్టబయలు చేసారు, నాణ్యత లేని కాలం చెల్లిన పదార్దాలతో నాసిరక వంటకాలతో అడ్డంగా ప్రజల నుండి దోచేస్తున్నారు దీనితో జీవీఎంసీ జోన్ 1 హెల్త్ అండ్ ఫుడ్ సిఫ్ట్ అధికారి ఎం.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బృందం చర్యలకు నడుంబిగించింది. మధురవాడ లో ఒక్కసారిగా పలు హొటల్స్ లో అధికారులు మెరుపు దాడులు చేశారు.ఈ దాడుల్లో అనేక రెస్టారెంట్లు, హొటల్స్, దాబాలు బాగోతం బట్టబయలైంది. హొటల్ అనుపమ గ్రాండ్ హొటల్ లో కోవిడ్ గైడ్ లైన్స్ లేకుండా విచ్చలవిడిగా నాసి రకపు ఫుడ్స్ అమ్మకాలను అధికారులు గుర్తించి నిలువ ఉన్న ఫుడ్ ను సీజ్ చేసారు. ఆహారపు నాణ్యత డొల్ల కళ్ళకు కట్టినట్లు గా కనిపించింది. అధిక రేట్లతో అమ్మకాలు చేస్తున్నట్లు, సరైన సేఫ్టీ, పరిశుభ్రత లేనట్లు అధికారులు గుర్తించారు అలాగే నాసిరకం నిత్యావసర వస్తువులు ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడుల్లో గుర్తించారు. ఫుడ్ సేఫ్ట్ అధికారులు గతంలో కూడా మధురవాడ జాతీయ రహదారిపై ఉన్న ప్రిన్స్ దాబా, అలాగే రుషికొండ వద్ద ఉన్న రాజు గారి ధాబాలో ఇదే విధంగా దొరకడంతో అధికారులు సైతం నివ్వెరపోయారు. గతంలో అనేక మంది పలు దాబా, హొటళ్లపై ఫిర్యాదు చేసిన అధికారులు లంచాలు దిగమింగడం తో ఈ హొటల్స్ మరియు దాబాల జోలుకు వెళ్లిన దాఖలు లేవు దీంతో యాజమాన్యం ఆడిందే ఆట పాడిందే పాట లాగా దర్జాగా కల్తీ ఆహారం తో ప్రజల నుండి వందలాది రూపాయలు అడ్డంగా మింగేస్తున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో హొటల్స్ యజమానికి గట్టి షాక్ ఇచ్చినట్లు అయింది. ఇప్పటికైనా హొటల్లో నాణ్యమైన ఆహారం దొరికేలా అధికారులు కఠినమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com